₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 06

మార్చి 16-31, 2019




## పీవీ పురస్కార ప్రదానోత్సవం



## ప్రపంచంలోని 4,000 మంది అత్యుత్తమ స్కాలర్లలో... భారతీయులు 10 మందే!



## ఎన్నికల ఉరుములకు ముందస్తు మెరుపులవుతాయా ఆ దాడులు?



# పద్మనాభయ్యతో ఎఫ్.డి.ఆర్ పరిశోధకుల భేటీ

ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్-ఎఫ్.డి.ఆర్) పరిశోధనా బృందం ఇటీవల అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కి) ఛైర్మన్, యూనియన్ హోంశాఖ మాజీ కార్యదర్శి కె. పద్మనాభయ్యతో హైదరాబాద్‌లో సమావేశమైంది. పుల్వామా దాడి, కాశ్మీర్ సంక్షోభం, భారత్-పాకిస్తాన్ సంబంధాలు, హోంశాఖకు సంబంధించిన విషయాలు, సుపరిపాలనకు చర్యలు, పట్టణాభివృద్ధి తదితర అంశాలపై వీరు ఇష్టాగోష్టిగా చర్చించారు. ఆయా అంశాలతోపాటు ప్రభుత్వ విధానాల రూపకల్పన ప్రమాణాలపై కూడా పద్మనాభయ్య అమూల్యమైన వివరాల్ని, సూచనల్ని ఎఫ్.డి.ఆర్ బృందానికి అందజేశారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

మార్చి 16-31, 2019 సంపుటి - 10 సంచిక - 06

## కార్టూన్ కార్నర్




నీవు నిమిత్త మాత్రుడవు. నేను నిత్యమూ సత్యమూ శాశ్వతమూ అయి ఉన్నాను. నన్ను నోట్ల రద్దు దహింపజాలదు! స్కీములు నన్ను కదల్చజాలవు...

## లోపలి పేజీల్లో...

మన్మోహన్‌కు పీవీ అవార్డు ప్రదానం ................. 5
'2019 ఎన్నికలు'.. ఓటుకు నోట్లు తాత్కాలిక.... 7
బట్టీయమే చదువని భ్రమల్లో బతికేస్తున్నాం........ 9
ఆంధ్రప్రదేశ్: సామాన్య శాస్త్రంలో 76 శాతంపైగా.. 14
తెలంగాణ : 'లెక్కగట్టలేనంత నిర్లక్ష్యం!.............. 16
నగరంలో అన్నీ మారాయి, ఒక్క మా కాలేజీ తప్ప.. 18
ప్రపంచంలోని 4000 మంది అత్యుత్తమ.......... 19
లోక్‌సత్తా పార్టీ - 2019 ఎన్నికలు, ............... 21
'సర్జికల్ స్ట్రయిక్స్' ఎన్నికల్లో ప్రధానాంశమైతే........ 24
పుల్వామా పాఠాలు ఏమిటి? ......................... 26
స్వేచ్ఛను లొంగదీసే దొంగాట ! ....................... 29
(మీడియాలో) 'కీ' కామెంట్లు !........................ 32
విద్య పట్ల నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోయిన ........ 34

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


FOLLOW ME ON
twitter
Friends, Interacting with youngsters always gives me immense pleasure. You can tweet your suggestions , ideas , queries to :
@JP_LOKSATTA
I will try to respond to as many as possible
DR.JAYAPRAKASH NARAYAN, FOUNDER, LOKSATTA




# మన్మోహన్‌కు పీవీ అవార్డు ప్రదానం

ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు సంస్కరణలు తీసుకొచ్చి ఆధునిక భారతదేశ నిర్మాణానికి మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, డా॥ మన్మోహన్ సింగ్‌ల కృషిని దేశం మరువదని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అన్నారు. పీవీ పేరిట నెలకొల్పిన మొదటి పురస్కారాన్ని అందుకునేందుకు మన్మోహన్ సింగే అర్హులన్నారు.

చెన్నై కేంద్రంగా పనిచేసే 'ఇండియా నెక్స్ట్' అనే ప్రభుత్వేతర సంస్థ పీవీ నరసింహారావు పేరిట నెలకొల్పిన జాతీయ నాయకత్వం, జీవిత సాఫల్య పురస్కారాన్ని మన్మోహన్ సింగ్‌కు ప్రణబ్ ఢిల్లీలో ప్రదానం చేశారు. ఒకప్పుడు పీవీ భౌతిక కాయానికి కూడా గౌరవం ఇవ్వకుండా అవమానించిన తీన్‌మూర్తి భవన్ ప్రాంగణంలోనే ఈ కార్యక్రమం జరగటం విశేషం. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్ వెంకటాచలయ్య అధ్యక్షతన రాజ్యాంగ నిపుణుడు డా॥ సుభాష్ కశ్యప్, సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తిల జ్యూరీ కమిటీ.. పీవీ దేశంలో సంస్కరణలను తీసుకురావటం లో కీలక పాత్ర పోషించటంతోపాటు వాటిని కొనసాగించటంలోనూ చేసిన కృషికిగాను మన్మోహన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసింది.

"కృత్రిమ బంధనాల నుంచి దేశ ఆర్థిక రంగాన్ని విడుదల చేయటంలో మన్మోహన్ కృషి ఎంతో ఉంది. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండటం మన్మోహన్ గొప్పతనం. పౌర అణువిధానం పట్ల ఎంతో వ్యతిరేకత వచ్చినప్పటికీ సాహసంతో నిర్ణయం తీసుకున్నారు. నిశ్శబ్దంగా ఉన్నా కృతనిశ్చయంతో ఆయన దేశానికి, పార్టీకి మార్గదర్శకత్వం వహించారు. 2004 నుంచి 2014 వరకు స్థిరమైన ప్రభుత్వాన్ని నెలకొల్పడంలో మన్మోహన్ పాత్ర ప్రశంసనీయం. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు ఎన్నడూ లేని విధంగా ఉన్నతవిద్యకు పెద్దపీట వేశారు" అని ప్రణబ్ ప్రశంసించారు.

మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ, ఆరు నెలల్లో మూడు సార్లు ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. "1991




జూన్‌లో నాటి ప్రధాని పీవీ తన కేబినెట్‌ను విస్తరిస్తున్నారు. ఆర్థికమంత్రిగా తీసుకుంటానని పీవీ నరసింహారావు తరవున వీసీ అలెగ్జాండర్ చెబితే నమ్మకుండా యథావిధిగా యూజీసీ ఛైర్మన్ బాధ్యతలను నిర్వర్తించే ందుకు కార్యాలయానికి వెళ్లాను. ఆ తర్వాత పీవీ ఫోన్ చేసి ఇంటికి వెళ్లి దుస్తులు మార్చుకుని మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానించారు. ప్రస్తుత కష్టకాలంలో సంపూర్ణంగా సహకరి స్తేనే నేను పదవిని చేపడతానని చెప్పారు. అందుకు ఆయన అంగీక రించారు. అయితే ఆర్థికమంత్రి బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించక పోతే వేటు తప్పదని కూడా హెచ్చరించారు" అని ఆనాటి విషయా లను గుర్తు చేసుకున్నారు.

లైసెన్స్ పర్మిట్ రాజ్‌ను రూపు మాపి పీవీ దేశాన్ని కాపాడారని మన్మోహన్




సింగ్ అన్నారు. కఠినమైన నిర్ణయాలు తీసుకుని విధానాలను అమలు చేయటంలో తనకెంతో సహకరించా రన్నారు. పీవీకి తాను కృతజ్ఞుడినని, ఆయన రుణం తీర్చు కోలేనని అన్నారు. ప్రముఖ పాత్రి కేయులు శేఖర్ గుప్తా మాట్లాడుతూ, మన్మోహన్ సింగ్ నుంచి చాలా విషయాల్ని నేర్చుకున్నానన్నారు. జేపీ మాట్లాడుతూ, పీవీ నరసింహారావు దేశం గురించే ఎక్కువ ఆలోచించే వారన్నారు. సొంత రాష్ట్రం, పార్టీ కన్నా మిగతా దేశం, ప్రపంచమే ఆయన సేవల్ని గుర్తించాయన్నారు. పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు సభలో నేతలు, ఇతర ప్రముఖులు నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ సతీమణి గురుశరణ్‌కౌర్, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జాతీయ సమన్వయకర్త ఎన్.వి సూర్యప్రకాశరావు, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, లక్ష్మీ అవధానం తదితరులు పాల్గొన్నారు. ○


**భా**రతదేశ వెనుకబాటుతనానికి కులం వంటి అంశాల కన్నా కూడా సరైన విద్య లేకపోవటమే ప్రధాన కారణం. కేవలం నాణ్యమైన విద్య లేకపోవటం వల్లే యువత ఉద్యోగాలను సంపాదించలేకపోతున్నారు, సొంతంగా ఉపాధి అవకాశాల్ని సృష్టించుకోలేకపోతున్నారు, రాజకీయాల్లో నాయకులుగా ఎదగలేకపోతున్నారు. ఏప్రిల్ 11 నుంచి దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి, అదేరోజు ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాల, యావత్ దేశ గతిని మార్చగలిగే నాణ్యమైన విద్య మీద 2019 ఎన్నికల్లోనైనా చర్చ జరుగుతుందా?

నాణ్యమైన విద్యను రాజకీయానికి కేంద్రబిందువు చేసేందుకు లోక్‌సత్తా తొలి నుంచీ తన ప్రయత్నం చేస్తూనే

असर
ASER
Evidence for Action

# '2019 ఎన్నికలు'.. ఓటుకు నోట్లు, తాత్కాలిక స్కీములా? నాణ్యమైన విద్యా?

ఉంది. నూతన విద్యావిధానంపై జాతీయస్థాయిలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వానికి తన వంతుగా సమగ్ర విధానాన్ని సమర్పించింది. ఆ విధానాన్ని ఇంకా ప్రకటించకుండా కేంద్ర ప్రభుత్వం వాయిదాల మీద వాయిదాలు వస్తూ కొత్త కమిటీని నియమించినా.. ఆ కమిటీకి నేతృత్వం వహిస్తున్న కస్తూరి రంగన్ బృందంతో కూడా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ సంప్రదింపుల్లో ఉంటూ సూచనల్ని అందజేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సురాజ్య యాత్ర పూర్తయ్యాక రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని వివరాలతో నాణ్యమైన విద్యకు నిర్దిష్ట సూచనల్ని అందించారు. అలాగే 2019 ఎన్నికలకు ఆంధ్రప్రదేశ్‌లో విడుదల చేసిన ముసాయిదా మేనిఫెస్టోలో కూడా లోక్‌సత్తా పార్టీ ఈ అంశానికి పెద్దపీట వేసి సమావేశాల ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. అయితే, ఇవన్నీ వేగంగా అమల్లోకి రావాలంటే, 'ఓటుకు–మంచి చదువుకు' లంకె పడాలి. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య.. ఎన్నికల ప్రధాన ఎజెండాగా మారాలి. మంచి చదువు, ఆరోగ్యం అందించాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం ఎందుకు వైదొలుగుతోంది? అని ప్రజలు ప్రశ్నించాలి. మంచి చదువు ఎలా వస్తుందో, ఆ రకంగా ఏ పార్టీ ఇస్తుందో అడిగి మరీ, తెలుసుకుని మరీ ఓటు వేయాలి.




విద్యాప్రమాణాలపై దేశవ్యాప్తంగా వార్షిక సర్వేను ప్రథమ్ సంస్థ విడుదల చేయటం మొదలుపెట్టి దాదాపు 14 ఏళ్లు గడిచిపోయాయి. తొలి నివేదిక విడుదల కార్యక్రమంలో డా॥ జేపీ పాల్గొని ప్రోత్సాహాన్ని అందించారు. తెలుగునాట లోక్‌సత్తా నేతలు, కార్యకర్తలు కూడా ఎక్కడికక్కడ సర్వేలో పాల్గొని సహకారాన్నిచ్చారు. పార్టీగా మారాక మాత్రమే లోక్‌సత్తా అసర్ నివేదికల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకోకుండా ప్రోత్సాహాన్ని మాత్రం కొనసాగిస్తోంది. అసర్ సర్వేలు ఇప్పటికి 13 వచ్చాయి.




తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా అభ్యసనా సంక్షోభం కొనసాగుతూనే ఉందని తాజా సర్వేలో కూడా వెల్లడైంది. అసర్ సర్వే కన్నా ప్రామాణికమైన అంతర్జాతీయ స్థాయి 'పీసా' సర్వే 2009లో జరిగింది. ఇందులో ఉన్నత పాఠశాల చదువుల నాణ్యతలో 74 దేశాల మధ్య భారతదేశం 73వ స్థానంలో చివరన నిలిచింది. మనకంటే కిర్గిజిస్థాన్ అనే దేశం మాత్రమే వెనుకబడి ఉంది.

పీసా సర్వేలో భారతదేశ వైఫల్యాన్ని గురించి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు లోక్‌సత్తా అనేక సందర్భాల్లో, అనేక వేదికల ద్వారా కృషి చేసింది. దీనిపై దిద్దుబాటు చర్యలు తీసుకుని విద్యార్థుల్లో విశ్లేషణ, తర్కం, గణిత సామర్థ్యాలు వంటివి పెంపొందించాల్సింది పోయి, ప్రభుత్వం ఏకంగా పీసా నుంచే వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. భారతదేశంలో ఉన్న సంక్లిష్ట భిన్నత్వ నేపథ్యాలకు పీసా సర్వే తగినది కాదని తప్పుడు భాష్యాలు చెప్పింది. ఏకులంలో, ఏ కుటుంబంలో పుట్టినా అందరికీ మంచి చదువు ఇవ్వటం ప్రభుత్వ మౌలిక బాధ్యత అన్న సూత్రాన్ని నిస్సిగ్గుగా ఉల్లంఘించి, తరతరాలుగా అణగారినవారికి నాణ్యమైన చదువులు అందకపోవటం మామూలే అన్నట్లు వ్యవహరించింది. పీసా సర్వేలో తమకవైఫల్యాల్ని విశ్లేషించుకుని వియత్నాం వంటి దేశాలు తమ విద్యావ్యవస్థను బాగు చేసుకుంటే (చివరికి కిర్గిజిస్థాన్‌లో కూడా పీసాలో వైఫల్యంపై పెద్దఎత్తున చర్చ జరిగి కొన్ని మౌలిక దిద్దుబాటు చర్యల్ని ప్రారంభించారు), మనదేశం మాత్రం ప్రజలకు విద్య పెద్ద ముఖ్యం కాదన్నట్లు కాడిపారేసింది.

ప్రపంచంలో కాస్త మెరుగైన ఆర్థికస్థాయి కలిగిన దేశాలన్నీ తమ మధ్య విద్యాప్రమాణాలను పోల్చి చూసుకునేందుకు పీసా సర్వేను ఏర్పాటు చేసుకున్నాయి. ఇందులో 2009లో భారత్ కూడా చేరింది. అయితే, మనం ఆర్థికంగా వేగంగా ఎదుగుతున్నామని, బ్రిటన్, జపాన్‌లను దాటేస్తున్నామని జబ్బలు చరుచుకునే నాయకులకు పీసా సర్వే చుక్కలు చూపించింది. జనాభా సంఖ్య వల్ల తప్ప ప్రజల్లో నాణ్యమైన సామర్థ్యాలుండబట్టి భారతదేశం ఎదగటం లేదనే చేదునిజాన్ని చాటి చెప్పింది. ఆ తప్పును దిద్దుకునే ప్రయత్నం చేయకపోవటం వల్ల ఇప్పటికీ భారతదేశం చదువులో ఘోరంగా వెనుకబడి ఉందని పీసా అనంతరం దేశీయంగా జరిగిన అనేక సర్వేలు కూడా వెల్లడిస్తున్నాయి.

దేశీయంగా జరిగిన అసర్, న్యాస్ సర్వేలు, కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్వహించిన సర్వేలు.. అన్నీ కూడా పీసా సర్వే ఫలితాల్నే ప్రతిధ్వనింప చేశాయి, చేస్తున్నాయి.

మనం స్కూళ్లలో 95–100 శాతం ఎన్‌రోల్‌మెంట్లు చూపిస్తున్నాం (కొన్ని దొంగలెక్కలున్నా) గానీ, దాని వల్ల లక్ష్యం నెరవేరి వారికి చదువొస్తోందా? అని మాత్రం పట్టించుకోవటం లేదు. పాఠశాల చదువులు సరిగా లేకపోవటం వల్ల ఉపాధి సంక్షోభం పెరుగుతున్నా దిద్దుబాటు చేసుకోలేదు.

2021 నుంచి తిరిగి 'పీసా' సర్వేలో చేరతామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల ప్రభుత్వం విద్యావ్యవస్థలో లోపాల మీద దృష్టి సారిస్తుందని నిపుణులు, పౌర సమాజ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అయితే, ప్రజలు ఎన్నికల డిమాండ్‌గా మారిస్తేనే అంతిమంగా విద్యావ్యవస్థ వేగంగా మారి నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయి. విద్యలో సక్సెస్‌కి నిర్వచనం మారి, బట్టీయం కంటే పిల్లలు నేర్చుకోవటానికి ప్రాధాన్యతనిచ్చే పద్ధతులకు ప్రోత్సాహం లభిస్తుంది. మారుతున్న సాంకేతికతకనుగుణంగా ప్రపంచంలో ఎక్కడికెళ్లినా ఉపాధిని పొందగలిగే శక్తిసామర్థ్యాలను మన బిడ్డలకు అందించే విద్యావ్యవస్థ రూపుదిద్దుకుంటుంది. ఏ దేశం వారితోనైనా ఆత్మన్యూనత లేకుండా వ్యవహారాలు నడపగల సత్తా మన పిల్లలకు సమకూరుతుంది.

డబ్బున్నవారికి, కొద్దిమంది అదృష్టవంతులకు మినహాయించి మనదేశంలో మిగిలిన కోట్లాది మెజారిటీ పిల్లల ఎదుగుదలకు విద్యారంగంలో పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నాయో తెలియజెప్పే అసర్ తాజా సర్వేను, న్యాస్ సర్వే వివరాలను, ఇతర కొన్ని అంశాలనూ ఇప్పుడు (తరువాతి పేజీల్లో) పరిశీలిద్దాం.

నాణ్యమైన విద్యను రాజకీయ ఎజెండాగా ఎందుకు మార్చాలో బల్లగుద్ది చెప్పే వివరాలివి. నోట్లు, ప్రలోభాలు, తాత్కాలిక తాయిలాల పథకాలు, కులాలు, మతాలు, రాజకీయ పార్టీలు, నేతల గెలుపోటములా? లేక మన బిడ్డల భవిష్యత్తుకు భరోసానిచ్చే ఎజెండానా?.. ఓటు ఎటు వేయాలన్నది మన ఛాయిస్... ○

# బట్టీయమే చదువని భ్రమల్లో బతికేస్తున్నాం
## - అభ్యసనా సంక్షోభానికి అద్దం పట్టిన అసర్ నివేదిక -

వార్షిక విద్యాస్థితి నివేదిక, అసర్-2018 ఇటీవల న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో విడుదల అయ్యింది. అసర్ ప్రయత్నంలో చిరకాలంగా పాలుపంచుకుంటున్న కొందరు సామాజిక కార్యకర్తలు నివేదికను విడుదల చేశారు. ముంబయికి చెందిన ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 2005 నుండి క్రమం తప్పకుండా ప్రతి ఏటా విడుదల చేస్తున్న నివేదికల పరంపరలో తాజా నివేదిక పదమూడవది. అసర్-2018 వెల్లడించిన కొన్ని అంశాలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పలు వార్తాకథనాలు వెలువడ్డాయి. సామాజిక మాధ్యమాలలో చర్చ కూడా మొదలయ్యింది. అందులో ఆవేశం, ఆగ్రహం, కలవరం, విస్మయం వంటివన్నీ కన్పించడంలో ఆశ్చర్యం లేదు. ప్రభుత్వరంగ విద్యను అపఖ్యాతి పాలు చేయడానికి ఇలాంటి నివేదికలు ఉద్దేశపూర్వకంగా వెలువరిస్తున్నారన్న భావన కూడా వ్యక్తమవుతోంది.




ఏంటి సార్ చెప్పేది, నేనూ ఇదే బడిలో నాయె చదువుకున్నది.

పత్రికల్లో వెలువడిన వార్తాకథనాలకు మాత్రమే పరిమితమై అసర్ నివేదికలను అర్థం చేసుకుంటే అటువంటి భావన కలగడం సహజమే. మనదేశంలో పిల్లల అభ్యసనా సామర్థ్యాలు నాసిరకంగా ఉన్నాయంటూ అసర్-2018 నివేదిక ప్రకటించిన అంశాన్నే పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. 8వ తరగతి చదివే పిల్లల్లో సగం మంది 5వ తరగతి స్థాయి పాఠ్యాంశాన్ని చదవలేకపోతున్నారనీ, 5వ తరగతి చదివే పిల్లల్లో సగానికిపైగా 2వ తరగతి స్థాయి పాఠ్యాంశాన్ని చదవలేకపోతున్నారనీ, మన పిల్లలకు తీసివేతలూ, భాగాహారాలూ రావడం లేదని అసర్-2018 నివేదిక వెల్లడించిన మాట నిజమే! పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత ఇంకా కొనసాగుతున్నదనీ, పిల్లల, ఉపాధ్యాయుల హాజరు మెరుగుపడలేదనీ అసర్ నివేదిక పేర్కొన్న మాట కూడా నిజమే! ప్రతిరోజూ కుప్పలుతెప్పలుగా వచ్చిపడే సమాచార గణాంకాల నుండి సంచలనాత్మక పతాక శీర్షికలకు పనికొచ్చే అంశాలను మాత్రమే మీడియా ఎంచుకుంటుందన్న సంగతిని మనం గుర్తుంచుకోవాలి. అసర్ నివేదికపై చర్చించాలనుకున్నప్పుడు రోజువారీ శీర్షికలపై ఆధారపడటం సమంజసం కాదు. మనం మరింత గంభీరంగా, లోతుగా సమస్యను పరిశీలించాల్సి ఉంది.

పాలకులు, విధాన నిర్ణేతలు, విధాన నిర్ణేతలు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ముందుగా ఒక వాస్తవాన్ని అంగీకరించాలి. మన విద్యా ప్రమాణాలు సవ్యంగా లేవు. మన పాఠశాల విద్య ఒక అభ్యసనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. సమస్య ఉందని అంగీకరిస్తే పరిష్కారాల కోసం ఆలోచించవచ్చు. తప్పించుకు తిరిగే క్రీడలో భాగంగా సమస్య లేనట్లు నటించడం మనకు బాగా అలవాటయిపోయింది. ఒకవేళ సమస్య ఉందని గుర్తించినా దానికి బాధ్యులు ఎవరనే ప్రశ్న వేసుకుని పరస్పర నిందలతో కాలం గడిపే అలవాటు కూడా మనకి వచ్చేసింది. సమస్యను వర్ణించడం కంటే దానికి పరిష్కారం వెదికితే మేలు జరుగుతుంది. ఆ దిశగా మన ప్రయత్నం కొనసాగించాలి.

మన పిల్లలు బడికి వెళ్తున్నారు. కానీ వారికి చదువు అబ్బడం లేదు. ఎన్నేళ్లు బడికి వెళ్తున్నా వారికి అభ్యసనా సామర్థ్యాలు నాసిగా ఉంటున్నాయి. ముఖ్యంగా పాఠశాల స్థాయిలో పఠనం, గణితం వంటి అంశాలలో పిల్లలకు ప్రాథమిక అభ్యసనా నైపుణ్యాలు అలవడటం లేదు. బలహీనమైన పునాదిపై పిల్లల చదువు కొనసాగుతోంది. దాంతో పైతరగతులకు వెళ్లిన పిల్లలు సైతం తగిన సామర్థ్యాలనూ, నైపుణ్యాలనూ సంతరించుకోలేకపోతున్నారు. ప్రపంచ అభివృద్ధి నివేదిక - 2018, ప్రణాళికా సంఘం ప్రచురించిన 2012 నాటి ప్రణాళికా పత్రాలు, ఐక్యరాజ్యసమితి ప్రకటించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పాఠశాల విద్యలో అభ్యసనా సంక్షోభం గురించి విపులంగా ప్రస్తావించాయి. పిల్లల అభ్యసనాస్థాయిలు నాసిగా ఉంటున్న విషయాన్ని నీతి ఆయోగ్ కూడా ప్రస్తావించింది. బడికి వెళ్తున్న పిల్లలు ఏ మేరకు రాణిస్తున్నారో

అంచనా వేసుకునే ప్రక్రియ చేపట్టాలని ఐరాస పిలుపునిచ్చింది.

ఈ నేపథ్యంలో మనం అసర్ నివేదికలను పరిశీలించాల్సి ఉంది. ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ యాన్యువల్ స్టేటస్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ఎ.ఎస్.ఇ.ఆర్ - అసర్) పేరుతో దేశవ్యాపిత సర్వేను 2005లో ప్రారంభించింది. ప్రథమ్ చేపట్టిన ఈ ప్రయత్నానికి వందలాది స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తున్నాయి. 2018 సర్వేలో 573 ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు పాలుపంచుకున్నాయి. ప్రభుత్వం నుండి ఎటువంటి నిధులు స్వీకరించకుండా ప్రథమ్ చేస్తున్న కృషికి స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు కీలకంగా వుంటూ వస్తున్నది. అసర్-2018 సర్వే దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 596 జిల్లాల్లో 17,730 గ్రామాల్లో జరిగింది. దాదాపు 30 వేలమంది వలంటీర్లు 3,54,944 గృహాలను సందర్శించారు. ఆయా కుటుంబాలకు చెందిన 3-16 వయో వర్గంలోని 5,46,527 మంది పిల్లల విద్యాస్థితిగతులను పరిశీలించారు. సుమారు 3 లక్షల 90 వేల మంది పిల్లల పఠన, గణిత సామర్థ్యాలను చిన్న పరీక్ష ద్వారా తెలుసుకున్నారు. దాంతోపాటు 15,998 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి అక్కడి మౌలిక సదుపాయాల స్థితిగతులను నమోదు చేశారు. పిల్లల అభ్యసనా స్థాయిలపై కుటుంబ, సామాజిక నేపథ్య ప్రభావాన్ని అంచనా వేసేందుకు కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, ఇళ్లలోని సదుపాయాలు, తల్లిదండ్రుల విద్యానేపథ్యం, పిల్లలకు ట్యూషన్ రూపంలో అందుతున్న అదనపు తోడ్పాటు వంటి అంశాలను కూడా అసర్ వలంటీర్లు నమోదు చేశారు. అసర్ సర్వే కుటుంబ కేంద్రంగా ఇంటి వద్ద జరగడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లల అభ్యసనా స్థాయిల్ని తులనాత్మకంగా పరిశీలించే అవకాశం కూడా లభిస్తోంది. భారత ప్రభుత్వం నిర్వహించే నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే ప్రభుత్వ పాఠశాలలకే పరిమితమై, పాఠశాల కేంద్రంగా జరుగుతున్న విషయాన్ని మనం గమనంలో ఉంచుకోవాలి.

### 6-14 వయో వర్గంలో పాఠశాల నమోదు ధోరణులు

దేశం మొత్తం మీద పాఠశాలల్లో నమోదు 97.2 శాతానికి చేరుకున్నది. 130 కోట్ల జనాభా కలిగిన మనదేశంలో బడి ఈడు పిల్లలు ఇంత పెద్దస్థాయిలో బడిలో చేరడం చిన్న విషయమేమీ కాదు. పిల్లల్ని చదివించుకోవాలన్న తపన తల్లిదండ్రుల్లో విపరీతంగా పెరిగింది. తాము చదువుకోలేకపోయినా పిల్లల్ని చదివించాలన్న ఒక ఆకాంక్షను తల్లిదండ్రుల్లో ప్రేరేపించడంలో సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమం, వయోజన విద్యాపథకం, విజయం సాధించాయన్న వాస్తవాన్ని మనం గుర్తు చేసుకోవాలి. ఈ సందర్భంగా పిల్లల నమోదులోని కొన్ని ధోరణులను అసర్-2018 సర్వే వెలుగులోకి తెచ్చింది. ఇంకా బడి బైట మిగిలిపోయిన 2.8 శాతం పిల్లల్లో బాలికలు జాతీయస్థాయిలో 4.1 శాతం ఉన్నారు. యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో బడి బైట బాలికలు 7 శాతం పైగా ఉన్నారు. 15-16 వయోవర్గంలో బడి బైట మిగిలిపోయిన బాలికలు జాతీయస్థాయిలో 13.5 శాతం వున్నారు. అదే వయోవర్గంలో బడి బైట బాలికలు మధ్యప్రదేశ్‌లో 26.8 శాతం, గుజరాత్‌లో 24.9 శాతం, యూపీలో 22.2 శాతం, రాజస్థాన్‌లో 20.1 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 21.2 శాతం ఉన్నారు. బాలికా విద్య పట్ల వివక్ష తగ్గుముఖం పడుతున్నప్పటికీ మధ్యభారత




### 8లోనూ తెలుగులో చదవలేకపోతున్నారు

తెలంగాణలో ఎనిమిదో తరగతి చదువుతున్న గ్రామీణ విద్యార్థుల్లో 9.6 శాతం మందికి కనీసం తెలుగు పదాలను కూడా పూర్తిస్థాయిలో చదవడం రాదని అసర్-2018 తెలిపింది. ఏడో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ప్రతి వందమందిలో ఇద్దరు కనీసం అక్షరాలను గుర్తుపట్టలేకపోతున్నారని పేర్కొంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో 1 నుంచి 9లోపు సంఖ్యలను గుర్తించలేని విద్యార్థులు 1వ తరగతిలో 20 శాతం మంది ఉంటే, రెండో తరగతిలో 9.2 శాతం మంది ఉన్నారు. ఇక 100 పైబడిన అంకెలను వెంటనే గుర్తించడంలో ఏడో తరగతి విద్యార్థుల్లో 17 శాతం మందికి చేతకావడం లేదు. 14-16 ఏళ్ల అబ్బాయిల్లో 75.4 శాతం, అమ్మాయిల్లో 83 శాతం మందికి ప్రాథమికంగా చదవడం వస్తోందని నివేదిక తేల్చింది. ప్రభుత్వ ఉపాధ్యాయుల హాజరు శాతం గతం కంటే కొద్దిగా పెరిగిందని తెలిపింది. మొత్తంగా చూస్తే, విద్యాప్రమాణాలు 2016 కంటే మరింత తగ్గిపోయాయని వెల్లడించింది.

రాష్ట్రాలలో వివక్ష ఇంకా ప్రబలంగా కొనసాగడం గమనించవచ్చు. నూరు శాతం నమోదు, నిలకడ సాధించాలంటే నమోదుపై ఇంతవరకూ పెడుతున్న దృష్టిని కొనసాగించాల్సి ఉందని అసర్ గణాంకాలు హెచ్చరిస్తున్నాయి.




దేశంలో ప్రైవేటు పాఠశాలలపై పెరుగుతున్న మోజు గత 10 సంవత్సరాలుగా నిలకడగా కొనసాగుతున్నది. అయితే గత మూడేళ్లలో ప్రైవేటు నమోదు స్థిరంగా ఒకచోటే నిలిచి వుందని అసర్ గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల నమోదు జాతీయస్థాయిలో 30.9 శాతం ఉందని అసర్–2018 నివేదిక వెల్లడించింది. ఈ సంఖ్య హర్యానాలో 55.3 శాతం, పంజాబ్‌లో 52.2 శాతం, యూపీలో 50 శాతంగా ఉంది. ప్రైవేటు పాఠశాలల్లో నమోదు 40 శాతం మించిన రాష్ట్రాలలో హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, కేరళ, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్, తెలంగాణ, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలల నమోదు ఆంధ్రప్రదేశ్‌లో 35.2 శాతం, తెలంగాణలో 41.8 శాతం ఉంది. అసర్ గణాంకాలన్నీ గ్రామీణ ప్రాంతాలకు చెందినవేనన్న వాస్తవాన్ని గమనంలో ఉంచుకున్నప్పుడు పిల్లల విద్య పట్ల గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు చూపుతున్న శ్రద్ధ మరింత ఆసక్తి కలిగిస్తోంది. ఆర్థిక స్తోమత లేకపోయినా పిల్లల చదువు కోసం ఎంతో కొంత ఖర్చు చేయడానికి తల్లిదండ్రులు సిద్ధపడుతున్నారనేది ఒక వాస్తవం. ప్రభుత్వ పాఠశాలలపై వారికి నమ్మకం లేకపోవడం మరో వాస్తవం. అయితే ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా అన్ని పాఠశాలల్లో ప్రమాణాలు నాసిగా ఉంటున్నాయనేది అసర్ గణాంకాలు వెల్లడిస్తున్న అసలు వాస్తవం.

నమోదు వయసు విషయంలో అసర్ గణాంకాలు ఆసక్తికరమైన సంగతులను వెల్లడిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలలు 3వ ఏట నుండే పిల్లల్ని చేర్చుకుంటున్నాయి. మూడేళ్ల వయసులో అంగన్‌వాడీలలో చేరుతున్న పిల్లలు 55.8 శాతం కాగా, ప్రైవేటు పాఠశాలల్లో చేరుతున్నవారు 9.9 శాతం ఉంటున్నారు. 4వ ఏట అంగన్‌వాడీలో చేరుతున్నవారు 49 శాతం కాగా, ప్రైవేటు బడిలో చేరుతున్నవారు 23.2 శాతం ఉన్నారు. 5వ ఏట అంగన్‌వాడీలో చేరుతున్నవారు 27.6 శాతం ఉండగా ప్రైవేటు పాఠశాలల్లో 27.4 శాతం, ప్రభుత్వ పాఠశాలల్లో 23.9 శాతం చేరుతున్నారు.

ప్రభుత్వం నడిపే అంగన్‌వాడీలలో పిల్లల చదువుకు సంబంధించిన ప్రాధాన్యం ఏమీ లేదు. కానీ ప్రైవేటు పాఠశాలల్లో చేరే పిల్లలకు ఏదో రూపంలో విద్యాసంబంధ కార్యక్రమం పరిచయం అవుతుంది. దాంతో ప్రైవేటు పాఠశాలల పిల్లలకు ఎంతో కొంత అదనపు నైపుణ్యాలు అభించడానికి ఆస్కారం ఏర్పడుతోంది. పైగా డబ్బు, సదుపాయాలు, తల్లిదండ్రుల విద్యానేపథ్యం కలిగిన పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చేరుతున్నారు. దాంతో వారికి పునాది సమయంలోనే అదనపు లబ్ధి చేకూరుతోంది. పై తరగతులకు వెళ్లే కొలదీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పిల్లల సామర్థ్యాల విషయంలో వ్యత్యాసం కనిపించడానికి పూర్వ పాఠశాల విద్య ఒక ముఖ్యాంశంగా ఉంటోందని అసర్ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీలను అనుసంధానం చేసి పూర్వ పాఠశాల విద్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అసర్ గణాంకాలు సూచిస్తున్నాయి

**తీసివేతలు చేయగలిగేవారి సంఖ్య తగ్గింది**

కనీస తీసివేతలు చేయగలిగే 3వ తరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లో 5 శాతం మేర తగ్గింది. 2016లో ఈ సంఖ్య 39.1 శాతం మేర ఉండగా, 2018 నాటికి 34.1 శాతంకి చేరింది.

**అభ్యసనా సామర్థ్యాల లోటు**

వయసుతో, చదువుతున్న తరగతితో సంబంధం లేకుండా దేశవ్యాప్తంగా పిల్లల అభ్యసనా సామర్థ్యాలు నాసిరకంగా ఉంటున్నాయని అసర్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఇరవై సంవత్సరాలుగా మనం పిల్లలను బడిలో చేర్చడంపై దృష్టి కేంద్రీకరించాం. నమోదు పెంచడంలో విజయం సాధించాం. ఇక ఇప్పుడు పిల్లల సామర్థ్యాలను, నైపుణ్యాలను మెరుగుపర్చడంపై కేంద్రీకరించాల్సిన తరుణం వచ్చింది. మన

## మూస చట్రం నుండి బైటపడి పరిష్కారం వెదకాల్సి ఉంది

**– డి. సోమసుందర్, ఎడిటర్, జనబలం**

అసర్ నివేదికలను తులనాత్మకంగా విశ్లేషిస్తే విద్యారంగంలోని కొన్ని ధోరణులను మనం గమనించవచ్చు.

మనదేశంలో పాఠశాల విద్య ఒక తీవ్ర అభ్యసనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. నమోదులో గణనీయమైన విజయం సాధించిన మన పాఠశాలలు విద్యాప్రమాణాల విషయంలో తడబడుతున్నాయి. పిల్లల అభ్యసనా సామర్థ్యాలు నాసిగా ఉంటున్నాయి. పిల్లలంతా బడికి వెళ్తున్నా వారేమీ నేర్చుకోలేక పోతున్నారు. బట్టీ పట్టించడం, కాపీలు కొట్టించడం ద్వారా మార్కులు, గ్రేడులు ప్రకటించి సంతృప్తి చెందుతున్నాం. వాళ్లకి అభ్యసనా సామర్థ్యాలు, జీవన నైపుణ్యాలు అలవడటం లేదన్న సంగతిని గుర్తించ నిరాకరిస్తున్నాం.

6–14 వయోవర్గం పిల్లల పాఠశాల నమోదు మనదేశంలో 92.7 శాతానికి చేరుకున్నది. అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి నినాదంతో సర్వశిక్షాఅభియాన్ గత పదిహేనేళ్లుగా సాగించిన కృషి ఫలితంగా నమోదు పెరిగింది. తాము చదువుకోకపోయినా పిల్లల్ని చదివించుకోవాలన్న తల్లిదండ్రుల తపన పాఠశాల నమోదు పెరగడంలో కీలక భూమిక పోషించింది. దేశం మొత్తం మీద బాలికా విద్య పట్ల వివక్ష తగ్గుముఖం పడుతుండటం హర్షణీయం. అయితే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ వివక్ష బలంగా కొనసాగుతోంది. నూరుశాతం నమోదు లక్ష్యాన్ని చేరుకోవాలంటే బాలికా విద్య పట్ల కొనసాగుతున్న వివక్షని సంపూర్ణంగా నిర్మూలించాల్సి ఉంటుంది.

ప్రైవేటు పాఠశాలల్లో నమోదు క్రమేపీ పెరుగుతూ జాతీయస్థాయిలో 30 శాతం వద్దకు చేరింది. చాలా రాష్ట్రాల్లో మొత్తం నమోదులో 40 నరుండి 60 శాతం ప్రైవేటు పాఠశాలల్లో ఉంది. పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పాత్ర గురించి ఎడతెగని చర్చ కొనసాగుతూనే ఉన్నది. ప్రైవేటు పాఠశాలల్లో ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయన్న తల్లిదండ్రుల భావన, ఆంగ్ల మాధ్యమంపై మొగ్గు ప్రైవేటు పాఠశాలల నమోదు పెరగడానికి కారణం. కానీ ప్రభుత్వ బడిలో చదివినా, ప్రైవేటు బడిలో చదివినా విద్యార్థులు రాణించడానికి, రాణించకపోవడానికీ కారణం వారికి అందుతున్న 'అదనపు విద్యా తోడ్పాటులోని వ్యత్యాసాలేనని' అసర్ తేటతెల్లం చేసింది. తల్లిదండ్రులు, సహవయస్కులు, ట్యూషన్ వంటి అదనపు తోడ్పాటు ఉన్న విద్యార్థులు ఎక్కడ చదువుతున్నారనే దానితో సంబంధం లేకుండా రాణిస్తున్నారు. పిల్లలందరికీ అదనపు తోడ్పాటు అందించడంపై మనం దృష్టి సారించాల్సిన అవసరం వచ్చింది.

ఒక తరగతిలో చదివే విద్యార్థులంతా ఒకే సామర్థ్యాన్ని కలిగి ఉండకపోవడం ఒక వాస్తవం. అసర్–2018 నివేదిక దేశవ్యాప్తంగా 3వ తరగతి చదివే పిల్లల సామర్థ్యాలపై చేసిన విశ్లేషణ చాలా కీలక అంశాన్ని లేవనెత్తింది. 3వ తరగతిలోకి వచ్చాక కూడా కనీసం అక్షరాలు గుర్తించలేనివారు 12 శాతం ఉన్నారని.. అక్షరాలు గుర్తించగలిగేవారు 22 శాతం ఉన్నారని అసర్ వెల్లడించింది. కేవలం 27 శాతం మాత్రమే క్రియాశీలకంగా పాల్గంటుండగా మిగిలిన 73 శాతం పిల్లలు సామర్థ్యాల లోటుతో పైతరగతులకు వెళ్తున్నారు. ప్రస్తుత గుండుగుత్త పరీక్షా పద్ధతిలో ఈ సమస్యకు పరిష్కారం లేదు. మూస చట్రం నుంచి బైటపడి పరిష్కారం వెదకాల్సి ఉంది. విద్యార్థి – ఉపాధ్యాయ నిష్పత్తిని, తరగతి గది – ఉపాధ్యాయ నిష్పత్తిని కచ్చితంగా పాటించాలి. సిలబస్ భారం తగ్గించాలి, అభ్యసనా సామర్థ్యాలవారీగా పిల్లల్ని మూల్యాంకనం చెయ్యాలి. లేనిపక్షంలో పాఠశాల విద్య పునాది బలహీనంగా కొనసాగుతుంది. మన పిల్లల నైపుణ్యాలు అరకొరగానే ఉంటాయి.

పాఠశాలల్లో ప్రధాన సమస్య తరగతివారీ సామర్థ్యాలు సాధించలేకపోవడమే! నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పేరుతో జాతీయ స్థాయిలో ప్రభుత్వం నిర్వహించే మూల్యాంకనంలో సైతం పిల్లలకు తరగతివారీ సామర్థ్యాలు లేవని వెల్లడయ్యింది. మూడవ తరగతి చదువుతూ 2వ తరగతి స్థాయి పాఠ్యాంశాన్ని చదవలేనివారు 49.7 శాతం ఉన్నారు. 8వ తరగతిలోకి వచ్చాక సైతం 2వ తరగతి స్థాయి పాఠ్యాంశాన్ని చదవలేనివారు 27.2 శాతం ఉన్నారు. 3వ తరగతి చదువుతూ రెండంకెల తీసివేత చేయలేనివారు 71.1 శాతం ఉన్నారు. 5వ తరగతి చదువుతూ భాగాహారం చేయలేనివారు 56 శాతం ఉన్నారు. రాష్ట్రాలవారీగా గణాంకాలు అసర్–2018 నివేదికలో మనకు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. అయితే గత పన్నెండేళ్ల అసర్ నివేదికలను తులనాత్మకంగా విశ్లేషిస్తే పిల్లల అభ్యసనా సామర్థ్యాలు ఎగుడు దిగుడుగా ఉన్నాయని తేలుతోంది. పిల్లలు పడుతూ, లేస్తూ, నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారని కూడా అవగతం అవుతుంది. 2008వ సంవత్సరం నమోదైన అత్యధికస్థాయి, 2010 నుండి క్రమేపీ పడిపోతూ వచ్చింది. అయితే 2014, 2016, 2018 సంవత్సరాలలో పిల్లల

సామర్థ్యాలు కొంత పుంజుకుంటున్నాయని అసర్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ బడులకు, ప్రైవేటు బడులకు మధ్య సామర్థ్యాల విషయంలో ఉన్న వ్యత్యాసాలు 2014 తర్వాత పెద్దగా పెరగలేదని తేలింది. ప్రైవేటు బడులలోని పిల్లల సామర్థ్యాలు స్తంభించిపోగా గత నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల సామర్థ్యాలు మెరుగవుతూ వస్తున్నాయి.

బడి ప్రైవేటుదా, ప్రభుత్వానిదా అనే అంశాన్ని పక్కన బెట్టి పిల్లలు రాణించడానికి, రాణించకపోవడానికి గల కారణాలను అసర్ నివేదికలు పరిశీలించాయి. 60 లోపు విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలల సంఖ్య నానాటికీ పెరుగుతూ వస్తోంది. అటువంటి పాఠశాలల్లో ఐదు తరగతులకూ కలిపి ఇద్దరే ఉపాధ్యాయులు ఉంటారు. అలాగే రెండు లేదా మూడు తరగతుల పిల్లలను కూర్చుండబెట్టే మల్టీగ్రేడ్ క్లాసెస్ సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రాథమిక స్థాయిలో మల్టీగ్రేడ్ క్లాసెస్ సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రాథమిక స్థాయిలో మల్టీగ్రేడ్ క్లాసులు నడుస్తున్న పాఠశాలలు 2010లో 55.2 శాతం ఉండగా, 2018 నాటికి వాటి సంఖ్య 63.4 శాతానికి పెరిగింది. అదే విధంగా అప్పర ప్రైమరీ స్థాయిలో మల్టీగ్రేడ్ క్లాసులు నడుస్తున్న పాఠశాలలు 2010లో 54 శాతం ఉండగా, 2018 నాటికి వాటి సంఖ్య 60.9 శాతానికి చేరింది.

విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి, తరగతి గది - విద్యార్థి నిష్పత్తిగాని దేశంలో పెద్దగా అమలవుతున్న దాఖలా లేదని అసర్ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల హాజరు 2010లో 72.9 శాతం కాగా, 2018లో 72.4 శాతం ఉంది. ఉపాధ్యాయుల హాజరు 2010లో 87.1 శాతం ఉండగా, 2018లో 85.1 శాతం ఉంది. అప్పర్‌ప్రైమరీ స్థాయిలో పిల్లల హాజరు 2010లో 73.4 శాతం కాగా, 2018లో 72.3 శాతం ఉంది. ఉపాధ్యాయుల హాజరు 2010లో 86.4 శాతం కాగా, 2018లో 85.8 శాతం ఉంది. తగినన్ని తరగతి గదులు, తగినంతమంది ఉపాధ్యాయులు లేకపోవడం ప్రధాన సమస్యగా కొనసాగుతున్నదని అసర్-2018 నివేదిక స్పష్టం చేసింది.

బడికి వచ్చిన పిల్లల సామర్థ్యాలు మెరుగుపడకపోవడంలో పలు కారణాలున్నాయని అసర్ నివేదిక వెల్లడించింది. ఒక తరగతిలో ఉన్న పిల్లల స్థాయిల్లో ఉన్న భేదాలపై తగు దృష్టి రావడం లేదు. 3వ తరగతి చదువుతున్న పిల్లల సామర్థ్యాలపై ప్రథమ్ సీఈవో డా॥ రుక్మిణీ బెనర్జీ చేసిన పరిశీలనలో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. దేశం మొత్తం మీద 3వ తరగతిలోకి వచ్చిన పిల్లల్లో ఇంకా అక్షరాలు గుర్తించలేని వారి సంఖ్య 12.6 శాతం ఉందనీ, పదాలు చదవగలిగినా వాక్యాలు చదవలేనివారి సంఖ్య 20.8 శాతం ఉందనీ రుక్మిణీ బెనర్జీ పేర్కొన్నారు. 2వ తరగతి స్థాయి పాఠాన్ని చదవగలిగే వారి సంఖ్య 27.2 శాతం మాత్రమేనని ఆమె ఉదహరించారు.

"మనం సిలబస్‌ను పూర్తి చేసే క్రమంలో పాఠ్యాంశాలను నిర్ణీత కాలవ్యవధి ప్రకారం చెప్పుకుంటూ వెళ్లిపోతున్నామని, అయితే 3వ తరగతి పిల్లల్లో తరగతివారీ సామర్థ్యాన్ని సాధించిన 27.2 శాతం పిల్లలకు మాత్రమే అభ్యసనం సక్రమంగా జరిగే సావకాశం ఉంటుందని" రుక్మిణీ బెనర్జీ విశ్లేషించారు. దీనివల్ల ఒకే తరగతిలో ఉన్న పిల్లల్లో కొందరికి చదువు వస్తోందని, మరికొందరికి చదువు రావడంలేదని, ఈ లోటును పూడ్చడానికి బడిలో ప్రయత్నం జరగడం లేదని ఆమె వివరించారు.

మన పాఠశాలల ప్రధాన సమస్య సిలబస్ ఎక్కువగా ఉండటం కూడానని అసర్ పేర్కొన్నది. పుస్తకాల భారంతోపాటు సిలబస్ భారం కూడా తగ్గించాలని సూచించింది. పాఠశాలల్లో డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టడానికి వీలుగా విద్యాహక్కు చట్టాన్ని సవరించారు. అయితే దాన్ని అమలు చేసే విషయంలో నిర్ణయాధికారం రాష్ట్రాలదే కావడంతో ఇంతవరకూ ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదు.

"సిలబస్ పూర్తి చేయడం, పరీక్షలు నిర్వహించడం, విద్యార్థులు పాసవ్వడం, ఫెయిల్ అవ్వడం వంటి మన మూస చట్రం నుండి పాఠశాల విద్యని బైటపడెయ్యడానికి తీవ్రమైన మార్పులు అవసరమని' ప్రథమ్ వ్యవస్థాపకుడు డా॥ మాధవ్ చవాన్ అభిప్రాయపడ్డారు. అభ్యసనా సామర్థ్యాల స్థాయిని బట్టి విద్యార్థులను పరీక్షించే విషయం ఆలోచించవచ్చని ఆయన సూచనమాత్రంగా ప్రస్తావించారు. విద్యలో పరోక్షంగా కొనసాగుతున్న వివక్షా రూపాలను తొలగించే విధంగా అభ్యసనం ఉండాలని ఆయన నొక్కి చెప్పారు.

పాఠ్యపుస్తకాలు సకాలంలో ఇవ్వడాన్ని, మధ్యాహ్న భోజనం అందరికీ అందించడాన్ని, పిల్లలకు స్కాలర్‌షిప్‌లను సక్రమంగా మంజూరు చేయడాన్ని ఘనవిజయాలుగా కీర్తించుకునే ధోరణిని ప్రభుత్వాలు మార్చుకోవాలని ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అన్నారు. పిల్లల సామర్థ్యాలు మెరుగుపర్చడాన్ని విజయంగా భావించే స్థితికి ప్రభుత్వాల ఆలోచనలు మారాలన్నారు. విద్యారంగంలో సాధించే విజయాలు ఒక ప్రభుత్వ పనితీరుకు కొలమానంగా భావించే పరిస్థితి రావాలన్నారు. అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపర్చడం కీలకమని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాలకులు గుర్తించే వరకూ అసర్ ప్రక్రియ కొనసాగుతుందని అసర్ సంచాలకురాలు విల్లీ మాధ్వా స్పష్టం చేశారు. స్వీకరించడానికి సిద్ధంగా ఉంటే 'అసర్' నేర్పే పాఠాలు చాలానే ఉన్నాయి. ○

# ఆంధ్రప్రదేశ్: సామాన్య శాస్త్రంలో 76 శాతంపైగా మార్కులు సాధించినవారు 5.54 శాతం లోపే

సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు విద్యాప్రమాణాల్లో మాత్రం దారుణంగా ఉన్నాయి. సరైన విద్యను అందించే బాధ్యతను నిర్లక్ష్యం చేయటం ద్వారా.. సంపద సృష్టిలో కొందరికే అవకాశాలు కల్పిస్తామని, ధనిక-పేద అంతరం విస్తరిస్తూనే ఉంటుందని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చెప్పకనే చెబుతున్నాయి.

పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై చేసిన సర్వేలో.. తెలంగాణలోలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయని తేలింది. గణితం, సామాన్య శాస్త్రం, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో ఏపీ విద్యార్థుల ప్రతిభ అంతంతమాత్రంగా ఉంది. సామాన్య శాస్త్రంలో మరీ వెనుకంజలో ఉన్నారు. 76 శాతం మార్కులు సాధించినవారు రాష్ట్రవ్యాప్తంగా 5.54 శాతానికి మించి లేరు.

2018లో దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో భాగంగా జాతీయ విద్యా, పరిశోధన మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఏపీలోని 1,029 పాఠశాలల్లో 36,119 మంది విద్యార్థులకు గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలు, ఇంగ్లీషు, తెలుగుల్లో పరీక్షలు నిర్వహించింది. జిల్లాలవారీగా నివేదికను విడుదల చేసింది. 35-50 మార్కులు వచ్చిన విద్యార్థుల ప్రతిభ కూడా మెరుగుపడాల్సి ఉందని స్పష్టం చేసింది. ఈ అభ్యసన పరీక్షల్లో ప్రభుత్వ విద్యార్థులతో పోలిస్తే కొన్ని జిల్లాలు మినహా అన్నింటిలోనూ ఎయిడెడ్, ప్రైవేటు విద్యార్థులే ముందంజలో ఉన్నారు. బాలుర కంటే బాలికలే మెరుగైన ప్రతిభ కనబరిచారని ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించిన జాతీయ సాధన సర్వే (న్యాస్) వెల్లడించింది. ఐదు సబ్జెక్టుల్లో మొత్తం 180 ప్రశ్నలు ఇచ్చి పరీక్షించారు.

**అరకొర సంఖ్యే..**

ఏపీలో ఒక్కో సబ్జెక్టులో 50 శాతం మార్కులు దాటిన విద్యార్థుల శాతం మరీ తక్కువగా ఉంది. సామాన్య శాస్త్రంలో 51-75 మార్కులు వచ్చినవారు చిత్తూరు జిల్లాలో కేవలం 12.30 శాతం మందే ఉన్నారు. గుంటూరులో 16.22 శాతం, కడపలో 17.99 శాతం, కర్నూలులో 17.51 శాతం, విజయనగరంలో 15.59 శాతం మంది ఉండటం చదువుల డొల్లతనాన్ని బయటపెడుతోంది.

76-100 మార్కులు సాధించినవారు చిత్తూరు జిల్లాలో 0.60 శాతం మంది మాత్రమే ఉన్నట్టు సర్వేలో వెల్లడైంది. ఈ జిల్లా అన్నింటిలో వెనుకబడే ఉంది. కర్నూలులో 1.04 శాతం, నెల్లూరులో 2.20 శాతం, ప్రకాశం 2.36 శాతం, కృష్ణా 1.64 శాతం, పశ్చిమ గోదావరి 1.61 శాతం, విశాఖపట్నం 1.44 శాతం మంది మాత్రమే ఉన్నారు.

**రాయలసీమలో అనంతపురం ఒక్కటే**

అన్ని సబ్జెక్టుల్లోనూ అనంతపురం జిల్లా రాష్ట్ర

| జిల్లాలవారీగా సామాన్య శాస్త్రంలో విద్యార్థుల పరిస్థితి (మార్కులు శాతంలో) | | |
|---|---|---|
| జిల్లా పేరు | 0-35 మార్కులు | 76-100 మార్కులు |
| అనంతపురం | 38.37 | 1.32 |
| చిత్తూరు | 55.16 | 0.60 |
| తూర్పు గోదావరి | 28.03 | 5.54 |
| గుంటూరు | 43.78 | 1.80 |
| కడప | 48.30 | 2.27 |
| కృష్ణా | 36.61 | 1.64 |
| కర్నూలు | 50.26 | 1.04 |
| నెల్లూరు | 46.42 | 2.20 |
| ప్రకాశం | 39.56 | 2.36 |
| శ్రీకాకుళం | 40.17 | 3.10 |
| విశాఖపట్నం | 37.59 | 1.44 |
| విజయనగరం | 49.83 | 0.51 |
| పశ్చిమ గోదావరి | 38.53 | 1.61 |

సరాసరితో సమానంగా ఉండగా.. చిత్తూరు కింది స్థాయిలో ఉంది. చిత్తూరు జిల్లా సరాసరి గణితంలో 35.78 శాతం ఉండగా, రాష్ట్ర సరాసరి 40.94 శాతంగా ఉంది. సామాన్య శాస్త్రంలో 76-100 మార్కులు వచ్చినవారు కేవలం 0.60 శాతం ఉండగా, రాష్ట్ర సరాసరి 1.97 శాతంగా ఉంది. కర్నూలు జిల్లా సాంఘికశాస్త్రం మినహా అన్నింటిలోనూ రాష్ట్ర సరాసరి కంటే దిగువనే ఉంది. కడప జిల్లా విద్యార్థులు ఇంగ్లీషు, భాషా సబ్జెక్టులు మినహా అన్నింటిలోనూ రాష్ట్ర సరాసరి కంటే వెనుకే ఉన్నారు.

**కృష్ణా రాజనీతి విభాగంలో వెనుకంజ**

కృష్ణా జిల్లా విద్యార్థులు సామాన్య, సాంఘిక శాస్త్రాల్లో రాష్ట్ర సరాసరితో సమానంగా ఉండగా.. మిగతా అన్నింటిలోనూ మెరుగ్గానే ఉన్నారు. అయితే, సాంఘిక శాస్త్రంలోని రాజనీతి విభాగంలో రాష్ట్ర సరాసరి కంటే వెనుకబడి ఉన్నారు. ఆంగ్లం మినహా అన్నింటిలోనూ గ్రామీణ విద్యార్థులే ఆధిక్యం ప్రదర్శించారు. గుంటూరు జిల్లా విద్యార్థులు గణితం, సామాన్య శాస్త్రాల్లో వెనుకుండగా, భాషా సబ్జెక్టుల్లో మాత్రం మెరుగైన ప్రతిభ చూపారు. ఇంగ్లీషులో ఇచ్చిన దాన్ని చదివి సరైన సమాధానాలు రాసింది 39.26 శాతం మంది మాత్రమే. ప్రకాశం విద్యార్థులు ఆంగ్లంలో రాష్ట్ర సరాసరితో సమంగా నిలువగా.. మిగతావాటిల్లో మెరుగైన మార్కులు సాధించారు. నెల్లూరు జిల్లా విద్యార్థులు సామాన్య శాస్త్రం, తెలుగు మినహా అన్నింటిలోనూ వెనుకబడ్డారు.

**గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలు**

తూర్పు గోదావరి జిల్లా అన్ని సబ్జెక్టుల్లోనూ రాష్ట్ర సరాసరి కంటే మెరుగ్గానే ఉంది. గ్రామీణ విద్యార్థులతో పోలిస్తే పట్టణ విద్యార్థులు సామాన్య, సాంఘిక శాస్త్రాలు, భాషా సబ్జెక్టుల్లో కొంత వెనుకబడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా విద్యార్థులు ఆంగ్లంలో రాష్ట్ర సరాసరి కంటే ముందున్నారు. మిగతా అన్నింటిలోనూ సమానంగా ఉన్నారు. విశాఖపట్నం జిల్లా సామాన్య శాస్త్రం, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో రాష్ట్ర సగటు కంటే ముందు నిలువగా.. మిగతా వాటిల్లో సమానంగా ఉంది. శ్రీకాకుళం జిల్లా ఒక్క ఆంగ్లంలో మినహా కొన్ని అంశాల్లో రాష్ట్ర సరాసరితో సమానంగా, కొన్నింట ముందంజలో కూడా నిలిచింది. విజయనగరం తెలుగు మినహా అన్నింటిలోనూ రాష్ట్ర సగటు కంటే వెనుకబడింది. ○

# తెలంగాణ: 'లెక్కగట్టలే'నంత నిర్లక్ష్యం!

*"ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే కొడుకును ప్రైవేటు స్కూల్‌కి, కూతురును ప్రభుత్వ బడికి పంపుతున్నారు. ఈ ఆలోచనా ధోరణి సరికాదు"*

***-2019 మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణలోని ఓ జిల్లా ఎస్పీ ఒక ప్రముఖ దినపత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్య***

*"తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు చదువు నేర్చుకోవడంలో వెనుకబడ్డారు. జాతీయ సగటు 142 పాయింట్లు కాగా, రాష్ట్రానికి మాత్రం 136.8 పాయింట్లే దక్కాయి. బడిలో చేరిన విద్యార్థి పైతరగతికి వెళ్లటం, అదే పాఠశాలలో చదువు పూర్తయ్యేవరకు విద్యనభ్యసించటంలోనూ జాతీయసగటు కంటే వెనుకబడింది. పాఠశాలల పనితీరుపై సాధించిన పాయింట్ల ఆధారంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆరు గ్రేడ్లుగా విభజించగా అందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా మూడు, నాలుగు గ్రేడ్లలో నిలిచాయి."*

***– కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా 2019లో విడుదల చేసిన దేశవ్యాప్త పాఠశాలల పనితీరు (2017-18) గ్రేడింగ్ సూచి***

ఇక 'న్యాస్' సర్వేను కొంత వివరంగా చూస్తే, తెలంగాణలోని పదో తరగతి విద్యార్థుల అభ్యసన స్థాయి దారుణంగా ఉంది. దాదాపు అన్ని సబ్జెక్టుల్లో పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా.. గణితంలో మరీ వెనుకబడి ఉన్నారు. 75 శాతం మార్కులు సాధించినవారు ఒకటీరెండు శాతానికి మించి లేకపోవడం గమనార్హం. సర్వే పరీక్షలో 0-35 మార్కుల్లోపు పొందినవారు 66 శాతానికిపైగా ఉండటం మన చదువుల డొల్లతనాన్ని వెల్లడిస్తోంది. గణితం తర్వాత.. సైన్స్, సాంఘికశాస్త్రం, ఇంగ్లీషు, తెలుగు సబ్జెక్టులలో అభ్యసన సామర్థ్యం తక్కువగా, అత్తెసరు స్థాయిలో ఉంది.

పదోతరగతి చదివే విద్యార్థుల ప్రతిభను ఆయా సబ్జెక్టుల్లో పరీక్షించి భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలను గుర్తించేందుకు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 2018లో దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించింది. దేశంలోని 610 జిల్లాల్లో 44,514 పాఠశాలల్లో 15.44 లక్షల పదో తరగతి విద్యార్థులను ఐదు సబ్జెక్టుల్లో పరీక్షించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 2,481 పాఠశాలలకు చెందిన 79,423 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదు సబ్జెక్టుల్లో 180 ప్రశ్నలు ఇచ్చి పరీక్షించారు. జిల్లాలవారీగా ఫలితాలను ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేసింది. ఆయా సబ్జెక్టుల్లో 35 శాతం కంటే తక్కువ మార్కులు సాధిస్తే అక్కడ విద్యార్థులు విద్యాపరంగా ప్రమాదంలో ఉన్నట్టేనని సంస్థ అభిప్రాయపడింది.

**50 శాతం దాటటమంటే పెద్ద ప్రయాసే**

ఒక్కో సబ్జెక్టులో 50 శాతం మార్కులు దాటినవారు తక్కువగా ఉన్నారు. గణితంలో అభ్యసన ఫలితాలు మరీ అధ్వాన్న స్థాయిలో



ఉన్నట్టు తేలింది. ఆదిలాబాద్ జిల్లాలో గణితంలో 50 శాతం మార్కులు దాటినవారు కేవలం 10.92 శాతమే. సైన్స్‌లో 75 శాతం దాటినవారు ఒక్కరూ లేరు. జోగులాంబ గద్వాల జిల్లాలో 50 శాతానికిపైగా మార్కులు సాధించినవారు 9.85 శాతం. జగిత్యాల జిల్లాలో అది 8.10 శాతం. ఇక్కడ 77.53 శాతం విద్యార్థుల మార్కులు 35 శాతం లోపే. మెదక్ జిల్లాలో సాంఘిక శాస్త్రంలో 75 మార్కులకుపైగా ఎవరికీ రాలేదు. ఈ జిల్లా అన్ని సబ్జెక్టుల్లో రాష్ట్ర సగటు కంటే వెనుకబడి ఉంది. కుమురం భీం జిల్లా విద్యార్థులదీ అదే పరిస్థితి. ఈ జిల్లాలో సైన్స్‌లో 75 శాతానికిపైగా మార్కులచ్చినవారు శూన్యం. గణితంలో 50 శాతం మార్కులు దాటినవారు 5.80 శాతం మందే. వికారాబాద్ జిల్లాలో గణితంలో 50 శాతం మార్కులు దాటినవారు 3.80 శాతం లోపే ఉన్నారు. కరీంనగర్, మంచిర్యాల, వరంగల్ అర్బన్, సంగారెడ్డి జిల్లా అన్ని సబ్జెక్టుల్లో రాష్ట్ర సగటు కంటే ఎగువనే ఉన్నారు. నిర్మల్, సిద్దిపేట జిల్లాలు నాలుగు సబ్జెక్టుల్లో రాష్ట్ర సగటు కంటే పైన నిలిచాయి.

| గణితంలో విద్యార్థుల పరిస్థితి (జిల్లాలవారీగా శాతాల్లో) | | |
|---|---|---|
| **జిల్లా** | **0-35 మార్కుల మధ్య** | **76-100 మార్కుల మధ్య** |
| నాగర్‌కర్నూల్ | 73.91 | 0.73 |
| నల్గొండ | 68.60 | 2.13 |
| నిర్మల్ | 75.00 | 0.93 |
| నిజామాబాద్ | 63.10 | 1.07 |
| పెద్దపల్లి | 61.54 | 2.49 |
| సిరిసిల్ల | 62.45 | 2.53 |
| రంగారెడ్డి | 58.22 | 4.35 |
| సంగారెడ్డి | 57.19 | 4.33 |
| సిద్దిపేట | 54.98 | 2.58 |
| సూర్యాపేట | 64.89 | 2.96 |
| వికారాబాద్ | 83.87 | 0.38 |
| వనపర్తి | 76.48 | 0.61 |
| వరంగల్ గ్రామీణ | 70.35 | 1.08 |
| వరంగల్ అర్బన్ | 46.47 | 9.22 |
| యాదాద్రి | 73.31 | 1.13 |
| కరీంనగర్ | 50.42 | 6.88 |
| ఖమ్మం | 68.61 | 4.14 |
| కొమురం భీం | 78.84 | 0.37 |
| మహబూబాబాద్ | 70.22 | 2.17 |
| మహబూబ్‌నగర్ | 69.17 | 1.53 |
| మంచిర్యాల | 60.98 | 2.94 |
| మెదక్ | 76.86 | 0.18 |
| మేడ్చల్ | 54.06 | 5.17 |
| కామారెడ్డి | 67.90 | 0.74 |
| జగిత్యాల | 77.53 | 1.01 |
| జనగామ | 64.84 | 1.22 |
| భూపాలపల్లి | 68.50 | 1.25 |
| గద్వాల | 72.54 | 0.19 |
| ఆదిలాబాద్ | 68.33 | 1.85 |
| భద్రాద్రి | 74.76 | 0.94 |

■ ప్రభుత్వ బడుల కంటే ప్రైవేటు పాఠశాలల్లో అభ్యసన ఫలితాలు కొంత మెరుగ్గా ఉన్నాయి. ఆంగ్లంలో ఆ తేడా భారీగా ఉంది. ఉదాహరణకు రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు సగటున 30.83 శాతం మార్కులు సాధించగా, ప్రైవేటులో 53.80 శాతం పొందారు. ప్రభుత్వ, ప్రైవేటు బడుల విద్యార్థులు వరుసగా.. కరీంనగర్ జిల్లాలో 34.05 శాతం, 55.72 శాతం, నల్గొండ జిల్లాలో 29.98 శాతం, 46.11 శాతం, నిజామాబాద్‌లో 32.88 శాతం, 44.08 శాతం మార్కులను సాధించారు. ❍

## నగరంలో అన్నీ మారాయి, ఒక్క మా కాలేజీ తప్ప..

పాఠశాల స్థాయి నుంచే భారత విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, ప్లస్ టూ (ఇంటర్) స్థాయిలో ఈ ఒత్తిడి ఇంకా ఎక్కువవుతోందని, దీంతో క్రిటికల్ థింకింగ్, సమస్యలను పరిష్కరించే నేర్పు, విశ్లేషణాత్మక ఆలోచన లోపిస్తున్నాయని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం అధ్యయనం తేల్చింది.




"పాఠశాల స్థాయి నుంచే పిల్లలను కోచింగ్, ట్యూషన్లకు పంపిస్తున్నారు. రోజూ పరీక్షల వల్ల విద్యార్థులు వాటి గురించే ఆలోచిస్తూ నిజమైన నైపుణ్యాలను కోల్పోతున్నారు. దాని ప్రభావం ఇంజినీరింగ్ విద్యపై పడుతోంది. ఉపాధ్యాయులు చెప్పినట్లు చదువుకోవడం, మార్కులు సాధించడం తప్ప సొంతంగా ఆలోచించడం తగ్గిపోతోంది. అందుకే చైనా, రష్యా విద్యార్థుల కంటే సాంకేతిక నైపుణ్యాల్లో భారత విద్యార్థులు వెనకబడ్డారు. అయితే శిక్షణలో వేగంగా మెరుగుపరచు కుంటున్నారు" అని ఆ నివేదిక తెలిపింది.

భారత్‌లోని ఇంజినీరింగ్ కళాశాలల్లో నాణ్యత పెంచేందుకు ప్రపంచబ్యాంకు టెక్విప్ పేరిట నిధులు మంజూరు చేస్తోంది. ఈ పథకం కింద భారత్‌తోపాటు చైనా, రష్యా, మరికొన్ని దేశాల్లోని విద్యార్థుల పరిస్థితిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సుమారు రెండేళ్ల క్రితం స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా 200 ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ ప్రథమ, మూడో సంవత్సరం చదువుతున్న 5,000 మంది విద్యార్థులను స్టాన్‌ఫర్డ్ వర్సిటీ ప్రతినిధులు పరీక్షించారు. గణితం, భౌతిక శాస్త్రంతోపాటు సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే తీరు తదితర వాటిపై ప్రశ్నలు అడిగి ఈ నివేదికను రూపొందించారు.

నివేదికపై అధ్యయనం చేస్తున్నామని, జ్ఞాపకశక్తిని పరీక్షించేలా కాకుండా నైపుణ్యాలను పెంచేలా పరీక్షలు ఉండాలంటూ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటున్నామని ఏఐసీటీఈ ఉపాధ్యక్షుడు ఎంపీ పూనియా ఇటీవల చెప్పారు.


ప్రాథమికాంశాల్లోనూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యం తక్కువగా ఉంటోదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రస్తుతం దేశంలో ప్రతి 100 మంది విద్యార్థుల్లో 26 మంది మాత్రమే ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు. వివిధ వృత్తి విద్యా కళాశాలల్లో 37 లక్షల సీట్లు అందుబాటులో ఉండగా 20 లక్షల మంది ప్రవేశాలు పొందుతున్నారు. వారిలో 13 లక్షల మందే డిగ్రీ పట్టాలు సంపాదిస్తున్నారు. ఉత్తీర్ణులైనవారిలోనూ సగం మంది ఉద్యోగాలకు పనికిరారని అధ్యయనాలు, పరిశ్రమలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మరింత మంది ఉన్నత విద్యకు వస్తే పరిస్థితి ఏంటి? పూణెకు చెందిన ఓ విద్యార్థి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి 30 ఏళ్ల తర్వాత సొంత నగరానికి వచ్చాడు. ఆయన నగరంలో తిరిగి చాలా మారిపోయిందని చెప్పాడు. తర్వాత తాను చదివిన కళాశాలకు వెళ్లి.. అదొక్కటి మాత్రం ఏమీ మారలేదని గుర్తించాడు" అని పూనియా వివరించారు. ఏఐసీటీఈ తెచ్చే మార్పులను మొదట అందిపుచ్చుకోవాల్సింది అధ్యాపకులేనని సూచించారు. ○




"విజ్ఞానం లేని విశ్వప్రేమ
నేతిబీరకాయ వంటిది.
ప్రమాదంగా పరిణమించవచ్చు."

- గాంధీజీ

# ప్రపంచంలోని 4000 మంది అత్యుత్తమ స్కాలర్లలో.. భారతీయులు 10 మందే!



*ఒక్లహామ స్టేట్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, ప్రధానమంత్రి సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ సలహా మండలి సభ్యుడు సుభాష్ కాక్.. రానున్న కాలంలో చోటు చేసుకోబోతున్న పలు కీలక మార్పుల గురించి ఇటీవల ఓ ఆంగ్ల పత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో వ్యక్తిగత విశ్వాసాలకతీతంగా తెలియజెప్పారు. భారతదేశం ఎదుర్కొంటున్న మేధోనైపుణ్య కొరత గురించి హెచ్చరించారు. ఆయన ఇంటర్వ్యూలోని అంశాలు స్థూలంగా..*

**భారత్‌కు గొప్ప అవకాశాలున్న సంధి దశ ఇది:**

ప్రపంచం ఇప్పుడు ఎంతో నాటకీయంగా, ఊహించలేనంత వేగంగా మారిపోతోంది. దీన్ని నాలుగో పారిశ్రామిక విప్లవంగా పిలుస్తున్నారు. కానీ కృత్రిమ మేధ, విద్యారంగాలు సహా శాస్త్ర, పారిశ్రామిక రంగాల్లో అమెరికాకున్న ప్రాముఖ్యతేమీ తగ్గదు.

కొత్త పుంతలను కోరుకునే సంధి దశలో ఉన్నామిప్పుడు. ఇందులో సంఘర్షణ పొంచి ఉంటుంది. ఇదే సమయంలో గొప్ప అవకాశం కూడా. తన సత్తాను వికసింప చేసుకుని శాస్త్ర, పారిశ్రామిక రంగాల్లో అగ్రస్థాయిలో ఉన్న దేశాల సరసన చేరటానికి భారత్‌కు ఇది సరైన సమయం. చైనా, ఇండియా, అమెరికా వరుసగా మూడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్న ప్రపంచం రాబోతుందన్న అంచనాలున్నాయి. ఇది జరిగినా కూడా, తనకున్న తక్కువ జనాభా వల్ల తలసరి ఆదాయంలో అత్యంత సంపన్న దేశంగా అమెరికాయే ఉంటుంది.

**మనుషులు చేసే దాదాపు అన్ని పనుల్నీ యంత్రాలు అనుకరించే రోజులొచ్చేస్తున్నాయి:**

మనం చేసే విశ్లేషణలు, అంచనాలు, నిర్ణయాలకు కారణమైన అవగాహన.. మనలోని చైతన్యం లేదా ఎరుక (కాన్షస్‌నెస్) నుంచే వస్తుంది. దీన్ని కొలత వేయలేం. కానీ తెలియజేసే సూచనల ద్వారా దీన్ని గుర్తించగలం. మనుషులకుండే ఈ సోయిని లేదా స్పృహని యంత్రాలు చివరికి సాధించగలవా అనే దానిపై మేధోప్రపంచంలో భిన్నాభిప్రాయాలున్నాయి. యంత్రాలకు ఎప్పటికీ ఆ శక్తి రాదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. కానీ ఇందుకు వ్యతిరేకమైన అభిప్రాయంతో ఉన్న ఉద్దండులు కూడా ఉన్నారు. అయితే, యంత్రాలు మనుషులకుండే చైతన్యస్థాయిని అందుకున్నా, లేకున్నా.. విశ్లేషణలు, నిర్ణయాలు సహా మనుషులు చేసే దాదాపు అన్ని రకాల పనుల్నీ యంత్రాలు అనుకరించగలవనేది ఎక్కువమంది ఏకాభిప్రాయం. ఇది ప్రపంచాన్ని అనూహ్యంగా మార్చేస్తుంది.. కొంత మంచిగా, కొంత చెడ్డగా!

**కనీస ఆదాయ పథకాన్ని అమలు చేసినా ఉపాధి సంక్షోభం, సమస్యలు ఆగవు,**

**జనాభా తగ్గిపోయే ప్రక్రియ ప్రమాదకర పరిణామాలకు దారితీయొచ్చు:**

కృత్రిమ మేధ యంత్రాలు, రోబోట్లను వినియోగించటం, యాంత్రీకరణ విస్తృతమవటం వల్ల ఉద్యోగాలు తగ్గిపోతాయి. అందరికీ నెలకింతని ప్రభుత్వమే ఇచ్చే సార్వత్రిక కనీస ఆదాయ (యూబీఐ) పథకాన్ని అమలు చేసినా కూడా అదో రకమైన అసమగ్ర దుర్భర ప్రపంచంగానే ఉంటుంది. అన్ని రకాల ఉద్యోగాలూ ఆవిరైపోతాయని కాదు. 80-90 లక్షల మందికి ఉపాధి కల్పించే చోట కేవలం 10-15 లక్షలమందికి మాత్రమే అర్థవంతమైన ఉద్యోగాలుండే పరిస్థితి వస్తుంది. రకరకాల ఒత్తిడులు పెరుగుతాయి. పిల్లల పెంపకానికయ్యే ఖర్చుల్ని పాశ్చాత్య దేశాల్లో చూస్తున్నాం. సామాజిక వివక్షకు

సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. ఇవి జనాభా తగ్గడానికి దారి తీస్తాయి. ప్రస్తుతమున్న సంఖ్య నుంచి బాగా తక్కువకు జనాభా పడిపోయే క్రమంలో ప్రమాదకరమైన పరిణామాలకు అవకాశముంది.

ఈ తగ్గింపు సరైన రీతిలో జరిగేలా చేయకపోతే, యుద్ధాలు, ఇతర ఘర్షణలు చోటు చేసుకుంటాయి. చైనా ఉదాహరణను ఇక్కడ ఉటంకించాలి. చైనా చౌకగా ఉత్పత్తులను తయారుచేయటం వల్ల అనేక చోట్ల స్థానిక ఉత్పత్తులు పోటీపడలేక నష్టపోయాయి. దీంతో స్థానిక ఆర్థిక వ్యవస్థలు కుదేలయ్యాయి. ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. పలు సమాజాల్లో యువత తీవ్రవాద భావాల వైపు మళ్లటానికి ఈ పరిణామం కూడా కారణమైంది.

**మానవాళి సూర్యకుటుంబం దాటి వెళ్లి నివాసాలు ఏర్పరచుకోవటం సాధ్యం కాకపోవచ్చు:**

సూర్యకుటుంబం ఆవల ఉన్న దూరాలు ఎంత సుదీర్ఘంగా ఉంటాయంటే, మానవాళి దాన్ని దాటి వెళ్లటం సాధ్యం కాకపోవచ్చు. అయితే చంద్రుడు, అంగారకుడుపై మానవ సహిత శాస్త్ర కేంద్రాలను రానున్న కాలంలో ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి.

**నైపుణ్యాలను పెంచటం భారత్‌కు అతి పెద్ద సవాలు:**

పనిచేసేవారిలో నైపుణ్యాల్ని పెంచటం భారత్‌కున్న అతి పెద్ద సవాలు అనుకుంటున్నాను. ఇండియాలో డబ్బులేనివారు చదువుకునే స్కూళ్ల నుంచి వచ్చిన కార్మిక శక్తి ప్రపంచ ప్రమాణాలకనుగుణంగా లేదు. పై చదువులకు అవకాశాలు అరకొరగా ఉన్నాయి. ఇటీవల ప్రపంచంలో 500 అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ర్యాంకుల్ని చూస్తే, భారత్ నుంచి ఒకే ఒక్కటి ఉంది. అదేవిధంగా, ప్రపంచంలోని 4,000 మంది అత్యుత్తమ స్కాలర్ల జాబితాను తయారు చేస్తే, అందులో భారత్ నుంచి కేవలం 10 మంది (0.25 శాతం) ఉన్నారు. అంటే, 130 కోట్ల జనాభా ఉన్న దేశంలో ప్రపంచస్థాయి స్కాలర్లను వేళ్ల మీద లెక్కపెట్టేయచ్చు. ఈ అంచనాల్ని మనం ఒప్పుకోవాల్సిన అవసరం లేకున్నా కూడా, ఈ గణాంకాలు మనకు గుణపాఠాలే. ప్రపంచంలోని 500 అత్యుత్తమ యూనివర్సిటీల జాబితాలోకి 50 భారతీయ విశ్వవిద్యాలయాలను వచ్చే 10 ఏళ్లలో తీసుకెళ్లటానికి మనం ప్రణాళికను అమలుచేయాలి.



క్షేత్రస్థాయి అవసరాలకనుగుణంగా కళాశాలల్లో ప్రవేశపెట్టే కోర్సుల్లో ఇంకా అనేక రకాల వృత్తి విద్య, స్వల్పకాలిక సర్టిఫికేషన్ ప్రోగ్రాంలను భారత్ అందుబాటులోకి తేవాలి. ఆన్‌లైన్ ద్వారా నేర్చుకునే సాంకేతిక పరిజ్ఞానాల్ని రకరకాల పద్ధతులతో బాగా సద్వినియోగం చేసుకోవాలి.

కేవలం సాంకేతిక నిపుణత మీదే సృజనాత్మకత ఆధారపడి ఉండదు. కళాశాల పాఠాల్లోని మానవీయ అంశాలకు దక్కాల్సిన ప్రాధాన్యత లభించటం లేదు. సృజనాత్మకత, కొత్త ఆలోచనల పోటీ మార్కెట్‌లో కీలకమైన సంక్లిష్ట ఆలోచనాశక్తిని విద్యార్థుల్లో పెంచటానికి బదులు, బట్టీపట్టటం వైపే విద్యావ్యవస్థ ఇప్పటికీ మొగ్గు చూపుతోంది.

**మూఢనమ్మకాలను భారత్‌లో మితిమీరి సాధారణీకరిస్తారు, సంక్లిష్ట సమాజంలో హేతుబద్ధతలేని కొంతమంది ఎప్పుడూ ఉంటారు:**

మూఢనమ్మకాల విషయంలో మిగతా దేశాల కంటే భారత్ అధ్వాన్నంగా ఉందని నేననుకోను. ఇతర దేశాల్లో కూడా ఛాందస విశ్వాసాలున్నాయి. అయితే, భారతదేశంలో ఆ గుడ్డినమ్మకాల్ని మితిమీరి సాధారణీకరిస్తారు. వాటి చుట్టూ లేనిపోని ప్రమాదాలను ఊహించుకుంటారు. ఒక సంక్లిష్ట సమాజంలో హేతుబద్ధతలేని భావాలుండే కొంతమంది ఎప్పుడూ ఉంటారు. ○




# లోక్‌సత్తా పార్టీ - 2019 ఎన్నికలు, 'ప్రజల మేనిఫెస్టో' ముసాయిదా - కొన్ని వివరణలు

లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగం 2019 ఎన్నికల కోసం ప్రజల మేనిఫెస్టోని రూపొందించాలని తల పెట్టింది. ముందుగా ఈ ముసాయిదా మేనిఫెస్టోను విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోని వివిధ నియోజక వర్గాలలో పౌరసంస్థలు, ప్రజాసంఘాలతో చర్చాగోష్టులు నిర్వహించింది. ప్రజల మేనిఫెస్టోకు తుదిరూపం ఇవ్వడానికి 2019 ఫిబ్రవరి 23న రాష్ట్ర సదస్సును విజయవాడలో నిర్వహించింది. ఇందులో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ కూడా పాలుపంచుకున్నారు.

ఇది అతి చిన్న మేనిఫెస్టో. కానీ అత్యంత కీలకమైన సమస్యలకు శాశ్వత మైన, సూత్రబద్ధమైన పరిష్కారాలను సూచిస్తున్నది. ఈ మేనిఫెస్టోకి గల ప్రత్యేకతలను అర్థం చేసుకోవడానికి వీలుగా కొన్ని వివరణలను మీ ముందు ఉంచుతున్నాం.

**1. మూస రాజకీయానికి ప్రత్యామ్నాయంగా జనరాజకీయం**

రాష్ట్రంలో సాంప్రదాయ పార్టీలు - అధికార, ప్రతిపక్ష పార్టీలు - సాగిస్తున్న ధనరాజకీయానికి, మూస (ఫార్ములా) రాజకీయానికి భిన్నంగా లోక్‌సత్తా పార్టీ జనరాజకీయ ప్రత్యామ్నాయాన్ని ఈ మేనిఫెస్టో ద్వారా ప్రతిపాదిస్తోంది. పేరుకే పార్టీలు, జెండాలు వేరుగాని వారు రాజకీయంగా సాగిస్తున్న ఆట మాత్రం ఒక్కటే. అధికారాన్ని దక్కించుకోవడమే ఈ పార్టీల ఏకైక లక్ష్యం. ఎన్నికలలో కోట్లు గుమ్మరించడం, ఓట్ల కొనుగోళ్లు, మద్యం పంపిణీ, ఇతర ప్రలోభాలు ప్రకటించడం లోనే పోటీ పడుతున్నారు. ప్రభుత్వ సొమ్ముతో ప్రలోభ ఉచితాల వాగ్దానాలలో ఒకరిని మించి మరొకరు పోటీ పడు తున్నారు. ఎస్.టి, ఎస్.సి, బీసీ, మైనారిటీలను, ఇతర కులాలను ప్రత్యేక ప్రలోభ పథకాల పేరుతో కులాలవారీగా, వృత్తులవారీగా చీలికలు పీలకలు చేసి వారిని ఓటుబ్యాంకులుగా మార్చుకోడానికి పోటీ పడుతున్నారు.. ఎవరు గెలిచినా అధికారాన్ని అవినీతికి వినియోగించు కుంటున్నారు. ప్రభుత్వ కాంట్రాక్టులలో, పథకాలలో, పౌరసేవలలో అవినీతి, సహజవనరుల దోపిడీ సాగిస్తున్నారు.

ఎవరు గెలిచినా వికృతమైన కేంద్రీకృత పాలనతో ప్రజలకు మౌలికవసతులు, ప్రాథమిక అవసరాలు, పౌర సేవలు అందించాల్సిన స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేస్తున్నారు. ప్రాథమిక విద్యను, రోజువారీ వైద్యసేవలను గాలికి వదిలేస్తున్నారు. యువతకు ఉపాధి, ఉపాధి నైపుణ్యాలు కాకి లెక్కలుగానే మిగులు తున్నాయి. వ్యవసాయాన్ని లాభసాటి చేస్తామన్నమాట నీటి మూటగానే చేస్తున్నారు. సాంప్రదాయ పార్టీలలో ఎవరు అధికారం పొందినా పాలన తీరు ఈ మూసలోనే తిరుగుతున్నది. అవినీతితో, అవినీతి మీద మనుగడ సాగిస్తున్న ఈ ధనరాజకీయాన్ని వదిలించుకోవాలి. అవినీతికి అడ్డుకట్ట వెయ్యడానికి, పౌరులు కేంద్రంగా పాలన సాగించడానికి, నిజమైన అభివృద్ధినీ, సంక్షేమాన్ని సాధించే ప్రత్యామ్నాయం అవసరం. లోక్‌సత్తా పార్టీ ఈ మేనిఫెస్టో ద్వారా అలాంటి ప్రత్యామ్నా యాన్ని ప్రజల ముందు పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నది.

**2. పేదలను విభజించి పాలించే ఓటుబ్యాంకు రాజకీయానికి స్వస్తి**

సాంప్రదాయ రాజకీయ పార్టీలు మన సమాజంలో ఉన్న కులాలను, ఉపకులాలను చీలికలు పేలికలు చేస్తూ తాత్కాలిక ప్రలోభాలతో, రాయితీలతో

ఓటుబ్యాంకు రాజకీయాన్ని సాగిస్తున్నాయి. పేదరికాన్ని శాశ్వతం చేస్తూ విభజించి పాలించే రాజనీతిని అనుసరిస్తూ వారికి స్వతంత్ర జీవనాన్ని, ఎదిగే అవకాశాలను కల్పించకపోగా రాజ్యాధికారంలో సముచిత భాగస్వామ్యానికి దూరం చేస్తున్నారు. ఈ తరహా ఓటుబ్యాంకు రాజకీయానికి భిన్నంగా లోక్‌సత్తా పార్టీ ఎస్.టి, ఎస్.సి, బీసీ, మైనారిటీలు, ఇతర అన్ని కులాల పేదలను ఐక్యపరిచే వేదికగా ఉమ్మడి ఎజెండాను ప్రకటించింది.

ఈ పేదలందరికీ జీవన భద్రత కోసం నివాస వసతి, ఉచిత వైద్యసేవలకు కుటుంబ డాక్టర్ల వ్యవస్థను, అందరికీ వ్యక్తిగతంగా మౌలిక ఆదాయ పథకాలను ప్రకటించింది. అందరికీ సమానంగా ఎదిగే అవకాశాల కోసం పాఠశాల విద్యా సంస్కరణలను ప్రకటించడంతోపాటు ప్రస్తుత ఎస్.టి, ఎస్.సి, బీసీ హాస్టళ్లను 1-10 వరకు ఉమ్మడి రెసిడెన్షియల్ పాఠశాలలుగా మంచి ప్రమాణాల విద్యకు ప్రత్యేక ఏర్పాట్లను ప్రకటించింది.

**3. జీవన భద్రతకు మౌలిక ఆదాయ పథకం**

అన్ని తరగతుల పేదలకు ఉద్దేశించిన ఉమ్మడి ఎజెండాలో భాగంగా లోక్‌సత్తా పార్టీ మౌలిక ఆదాయ పథకాన్ని ప్రకటించింది. ఇది అన్ని కులాల పేదలకు వర్తిస్తుంది. వ్యవసాయ కూలీలకు, కౌలుదారులకు, పేద, మధ్యతరగతి రైతులకు, పట్టణాలలో రవాణా రంగంలో, షాప్స్ & ఎస్టాబ్లిష్‌మెంట్ సంస్థలలో, భవన నిర్మాణ, ఇంటిపనివారితో సహా అసంఘటిత రంగంలో ఉన్న వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఇది కుటుంబ పథకం కాదు. ప్రతి వ్యక్తికీ వర్తించే జీవన భద్రతా పథకం. 1 కోటీ 25 లక్షలమంది నెలకు 2,000 రూపాయలు నగదుగా పొందుతారు. రాష్ట్రంలో దశాబ్దాలపాటు కొనసాగుతూ వస్తున్న దారిద్ర్యరేఖకు దిగువన ఉండే స్థితిని ఈ పథకం పూర్తిగా తొలగిస్తుంది. ఇది ప్రలోభ ఉచితం కాదు. దారిద్ర్య నిర్మూలనకు ఉద్దేశించిన పథకం. అధికార-ప్రతిపక్ష పార్టీలు కేవలం ఓట్ల కోసం ప్రకటిస్తున్న అనాలోచిత ప్రలోభ ఉచితాలన్నిటినీ రద్దు చేసి వాటి స్థానంలో రేపటి గురించి చింత లేకుండా జీవన భద్రతను ప్రతి ఒక్కరికీ కల్పిస్తుంది. ఈ పథకానికి సంవత్సరానికి 30 వేల కోట్లు కావాలి. రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరం సంక్షేమం పేరుతో సాగిన ఖర్చు 50 వేల కోట్లకు పైగా ఉంది. అందువల్ల మౌలిక ఆదాయ పథకం ఆచరణ సాధ్యమేకాక అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది. పైగా ఈ పథకం అధికార-ప్రతిపక్ష పార్టీలు ప్రకటించిన అన్ని కార్యక్రమాల కంటే ఎక్కువ లబ్ధిని అందరికీ అందిస్తుంది. ప్రభుత్వాలు మంచి ప్రమాణాల విద్యని, వైద్యసేవలని విధిగా అందించటంతోపాటు జీవన భద్రతను కల్పించాలి. విస్తరిస్తున్న ఆర్థిక అభివృద్ధి అందరికీ దక్కాలి. దేశ ఆదాయంలో 73 శాతం 1 శాతం మందికి చేరుతున్న స్థితిలో దీని అవసరం మరింతగా ఉంటుంది.

4. మద్యం షాపులు ప్రైవేటు వ్యక్తుల చేతులలో ఉన్నంతకాలం గ్రామాలలో బెల్టు షాపులు పుట్టుకొస్తూనే ఉంటాయి. గ్రామాలలో మద్యం అమ్మకాలను నిషేధించడానికి కఠిన మద్యనియంత్రణ కోసం ప్రభుత్వమే పరిమితంగా మద్యం షాపులు నిర్వహించే పద్ధతిని లోక్‌సత్తా ప్రకటించింది.

5. గ్రామాలను, పట్టణాలను మౌలిక వసతులతో నివాసయోగ్యం చెయ్యటానికి వాటికి సాధికారత కల్పించడంతోపాటు ప్రతి ఏటా తలసరి 1,000 రూపాయలు ఎలాంటి షరతులు లేని గ్రాంట్‌గా ప్రకటించింది.

6. లాభసాటి వ్యవసాయం కోసం మధ్య దళారీ వ్యవస్థ రద్దుతోపాటు ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను, పంటలవారీ కో-ఆపరేటివ్‌లను, స్టోరేజీ, ప్లెడ్జి లోనులు తదితరాలను ప్రతిపాదించింది.

7. ఉపాధితోపాటు, వెనుకబడిన ప్రాంతాలలో పెట్టే పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను లోక్‌సత్తా ప్రకటిస్తోంది.

8. ప్రాంతీయ అసమానతలు తొలగించడానికి ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రాంతీయ మండళ్ల ఏర్పాటును లోక్‌సత్తా ప్రతిపాదించింది.

**9. వాగ్దానాలకు జవాబుదారీతనం:**

లోక్‌సత్తా పార్టీ ప్రతిపాదించిన అంశాలకు అవసరమైన నిధులను ఎక్కడి నుండి ఎలా సమకూరుస్తుందో ప్రస్తుత రాష్ట్ర ఆదాయవ్యయాల ఆధారంగా నిర్దిష్టంగా తన ద్రవ్య ప్రణాళికను తుది మేనిఫెస్టోలో ప్రకటిస్తుంది. గాలి వాగ్దానాలు చేసే రాజకీయానికి స్వస్తి పలుకుతుంది.

మొత్తం మీద ఆటగాళ్లను మాత్రమే మార్చే రాజకీయానికి భిన్నంగా ఆటనియమాలను మార్చే ప్రత్యామ్నాయ రాజకీయానికి .. అధికారమే లక్ష్యంగా, అవినీతి చుట్టూ తిరుగుతున్న ధనరాజకీయానికి భిన్నంగా పౌరులు కేంద్రంగా, ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా, అవినీతిని అరికట్టే జనరాజకీయ ప్రత్యామ్నాయానికి లోక్‌సత్తా పార్టీ మేనిఫెస్టో దారి చూపిస్తుంది.

## లోక్‌సత్తా పార్టీ ఎన్నికల మేనిఫెస్టో 2019లోని అంశాలు

**1. అవినీతిని తొలగిద్దాం - సంక్షేమాన్ని, అభివృద్ధిని సాధిద్దాం**

ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీ ఓట్లు కొనుగోలు చెయ్యదు. అధికారంతో అవినీతి పరుల భరతం పడుతుంది. అవినీతిపై సమరానికి ప్రత్యేక చట్టం తెస్తుంది. ఇందులో కోరలు గల లోకాయుక్త, లోకాయుక్త పరిధిలో ఏసీబీ ఉంటాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు, జాప్యాలు లేకుండా పౌరసేవల

గ్యారంటీకి చట్టం తెస్తుంది. అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుని, అవినీతి సొమ్మును సంక్షేమానికి, అభివృద్ధికి వినియోగిస్తుంది.

**2. అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలు**

ప్రతి తరగతికీ టీచర్, తగిన సంఖ్య పిల్లలతో రేషనలైజేషన్.. దూరం పిల్లలకు ఉచిత రవాణా సౌకర్యం.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు రెండు భాషలలో ఒకే పరీక్ష. పాఠశాలలో మధ్యంతర పరీక్షలు, ఇంటికి ప్రోగ్రెస్ కార్డులు. విద్యాప్రమాణాల గ్యారంటీ. ఉమ్మడి రెసిడెన్షియల్ స్కూళ్లుగా ఎస్.టి, ఎస్.సి, బీసీ హాస్టళ్లు.

**వైద్యసేవలు:** రోజువారీ జబ్బులకు, తొలిదశలోనే నివారణకు, చికిత్స పేరుతో మోసపోకుండా ఉండటానికి అందరికీ కుటుంబ డాక్టర్ల వ్యవస్థ – జిల్లాకు ఒక ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ – ఉచితంగా అన్ని జబ్బులకు వైద్యం, పరీక్షలు, మందులు.

**3. సామాజిక న్యాయం**

ఐక్యతతో స్వతంత్ర జీవనం, రాజకీయ భాగస్వామ్యం, రిజర్వేషన్లలో ప్రత్యేకతలు మినహాయిస్తే వివక్ష తరగతులకు, ఇతర పేదలకు దైనందిన సమస్యలన్నీ ఉమ్మడి సమస్యలుగా లోక్‌సత్తా పరిగణిస్తుంది. రాజ్యాధికారంలో భాగస్వామ్యం కూడా ఈ తరగతుల మధ్య ఐక్యతతోనే సాధ్యపడుతుందనీ భావిస్తూ, అలాంటి ఐక్యతకు లోక్‌సత్తా కృషి చేస్తుంది.

అందరికీ నివాస వసతి, రోజువారీ జబ్బులకు ఉచిత వైద్యసేవలకు అందించే కుటుంబ డాక్టర్ల పద్ధతి, మంచి ప్రమాణాల పాఠశాల విద్య, ఉమ్మడి, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఉపాధినిచ్చే వృత్తి నైపుణ్యాలు సాధించుకునే ఉమ్మడి మేనిఫెస్టోను ప్రకటిస్తున్నది. అందరికీ ఎదిగే అవకాశాలతో పాటు, స్వతంత్ర జీవనానికి తొలి అడుగుగా అందరికీ మౌలిక ఆదాయాన్ని కల్పించే పథకాన్ని ప్రకటిస్తుంది.

ఇది మౌలిక ఆదాయ పథకం. దీని ద్వారా ప్రతి వ్యక్తికీ ప్రతి నెల 2,000 రూపాయలు నగదు బదిలీ జరుగుతుంది.

కొన్ని ప్రత్యేక పథకాలు మినహాయించి సంక్షేమం పేరుతో సాగుతున్న అన్ని పథకాలు దీనిలో విలీనం అవుతాయి. వ్యవసాయ కూలీలు, పేద రైతులు, కౌలుదారులు, అన్నిరకాల చేతి వృత్తులవారు, అసంఘటితరంగ కార్మికులు, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం పరిధిలోనివారు, అన్ని రకాల రవాణారంగాలలో పనిచేసే వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఇందులో భాగంగా ఎస్.సి, ఎస్.టి, బీసీ, ఇతర తరగతుల పేదలు, మహిళలు, మైనారిటీలు లబ్ధి పొందుతారు.

**4. మద్యంతో రాజకీయానికి స్వస్తి – గ్రామాలలో మద్యం అమ్మకాల నిషేధం**

లోక్‌సత్తా ఎన్నికల్లో మద్యం పంపిణీ చెయ్యదు – ప్రభుత్వమే పరిమితంగా మద్యం అమ్మకాలు చేస్తుంది – గ్రామాలలో మద్యం అమ్మకాలను నిషేధిస్తుంది – మద్యం బానిసల విముక్తికి ప్రత్యేక చర్యలు – గ్రామ పంచాయతీలకే మద్యనిషేధం పర్యవేక్షణాధికారాలు.

**5. ప్రాథమిక అవసరాలను తీర్చే స్థానిక ప్రభుత్వాలు**

తక్షణం విధులు, నిధులు, సిబ్బందిలను స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయటం – కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కాకుండా రూ.1,000 తలసరి అన్ టైడ్ (బేషరతు) గ్రాంట్ – అందరికీ నివాస వసతి, శుద్ధి చేసిన మంచినీరు, పారిశుద్ధ్యం, పౌర సేవలు అందించే గ్రామ సచివాలయం – పూర్తిస్థాయి పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య సేవలు – వ్యవసాయం, కుటీర పరిశ్రమలు, చేతివృత్తుల ఆధునీకరణ – దీనికి అవసరమైన వృత్తి ఉపాధి శిక్షణలు – డ్వాక్రా ఉత్పత్తులతో సహా అన్ని ఉత్పత్తులనూ మార్కెట్లకు అనుసంధానాల్ని లోక్‌సత్తా ప్రకటిస్తోంది.

**6. లాభసాటి వ్యవసాయం – కౌలుదారులకు ఊరట**

రైతులు ఉత్పత్తులను ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను ఇస్తుంది – రైతుకి, కొనుగోలుదారునికి మధ్య దళారీ వ్యవస్థ నిర్మూలన – పంట నిల్వకు ఏర్పాటు, ప్లెడ్జి రుణాలు, ప్రోసెసింగ్ పరిశ్రమల పెంపు – పాల సహకార సంఘాల తరహా పంటలవారీ రైతు సహకార సంఘాలు – వాటి చేతుల్లోనే మార్కెట్ కమిటీలు, ఉత్పత్తుల ధరల నిర్ణయం – రైతుల భూమి హక్కుకు భంగం కలిగించని విధంగా ప్రభుత్వ హామీతో పంట రుణాలు, రాయితీలను మాత్రమే పొందే కొత్త కౌలు చట్టం, చిన్న భూ కమతాల రైతులకు, కౌలుదారులకు, వ్యవసాయ కూలీలకు మౌలిక ఆదాయ పథకం వర్తింపు.


**7. పారిశ్రామిక అభివృద్ధి – ప్రాంతీయ అసమానతల తగ్గింపు – యువతకు ఉపాధి**

ప్రాంతీయ అసమానతలు తొలగించే వాటికి, వ్యవసాయాధారిత పరిశ్రమలకు, సాధారణ ఉపాధినిచ్చే వాటికి ప్రత్యేక – ప్రోత్సాహకాలు – మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత – ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రాంతీయ కౌన్సిళ్లు – జిల్లాలకు, నగరాలకు పూర్తి స్వయంపాలన

**8. మేనిఫెస్టోతోపాటు విధిగా ద్రవ్య ప్రణాళిక**

అవసర ఉచితాలకే పరిమితం. ప్రలోభ ఉచితాలకు దూరం ప్రకటించిన ప్రతి పథకానికి అయ్యే అంచనా ఖర్చును లోక్‌సత్తా ప్రకటిస్తుంది. ఆ నిధులను ఎక్కడి నుండి సమీకరిస్తుందో ప్రకటిస్తుంది – తుది మేనిఫెస్టోతోపాటు ఈ ద్రవ్యప్రణాళికను ప్రకటిస్తుంది – అప్పులు చేసి పప్పులు పంచడానికి స్వస్తి పలుకుతుంది. ❍

"జమ్మూ, కాశ్మీర్‌లో ఓటు మూడు ప్రాంతాలవారీగా, మతాలవారీగా చీలిపోయింది. ఆయా ప్రాంతాలు, మతాల మధ్య సమన్వయాన్ని, ఐక్యతను సాధించటం, విద్వేషాల్ని తొలగించటం, అవినీతిని అంతమొందించి అభివృద్ధిని చేపట్టటం, గాయపడ్డ ప్రజలకు అండగా నిలవటం.. కొత్త ప్రభుత్వం ముందున్న కీలక బాధ్యత" అని 2014 డిసెంబర్‌లో జమ్మూ,కాశ్మీర్‌లో ఎక్కువ సీట్లు సాధించిన పీడీపీ, బీజేపీ, ఇతర రాజకీయ పార్టీలనూ అభినందిస్తూ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సూచించారు. పార్టీలు పరిణతితో వ్యవహరిస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కానీ ప్రత్యేక పరిస్థితులున్న ఆ రాష్ట్రంలో కూడా దేశాన్ని గెలిపించటం లక్ష్యంగా కాకుండా.. బీజేపీని ఎలా పూర్తి మెజారిటీతో గెలిపించాలి అని మాత్రమే మోదీ బృందం వ్యవహరించటం పట్ల జేపీ ఆ తర్వాత 2017లో ఓ సందర్భంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో మరో కీలకావకాశాన్ని మోదీ ప్రభుత్వం జారవిడిచిందన్నారు. ఈ సమయంలో అక్కడున్న ఓ మీడియా మిత్రుడు మాట్లాడుతూ, మోదీ తీరు చూస్తుంటే రానున్న ఎన్నికల్లో గెలవటానికి చైనాతో యుద్ధానికి సిద్ధపడినా ఆశ్చర్యపోనక్కర్లేదు అని అభిప్రాయపడ్డారు.



2016లో ఉడీ సైనిక స్థావరంపై ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా మనదేశ సైన్యం సర్జికల్ స్ట్రయిక్స్ (మెరుపుదాడులు) చేసింది. తిరిగి 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కాశ్మీర్ పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ ట్రక్కులపై మానవబాంబు దాడితో 45 మంది జవాన్లు మరణించటంతో ప్రతిగా భారత వాయుసేన యుద్ధవిమానాలు పాక్ భూభాగంలోకి ప్రవేశించి మెరుపుదాడులు చేశాయి. పుల్వామా దాడి తమ పనేనని జైషే మహమ్మద్ నాయకుడు మసూద్ అజహర్ ప్రకటించాడు. సర్జికల్ స్ట్రయిక్ ద్వారా జైషే ఉగ్రవాద స్థావరాల్లోని దాదాపు 300 మంది

# 'సర్జికల్ స్ట్రయిక్స్' ఎన్నికల్లో ప్రధానాంశమైతే, భారత్ ఓడిపోయినట్లే

అప్పుడే డోక్లాం ఉద్రిక్తత తరచూ వార్తల్లోకొస్తోంది. అయితే ఆ అభిప్రాయాన్ని జేపీ తోసిపుచ్చారు. 'చైనాతో యుద్ధమంటూ వస్తే మనదేశాన్ని పచ్చడి చేసేస్తారు. మీరు ఇలాంటి అభిప్రాయాలను వ్యాప్తి చేయకండి' అని నిరుత్సాహ పరిచారు. అయితే సుపరిపాలన దిశగా గొప్ప అవకాశాన్ని జారవిడుస్తున్నందున, ఎన్నికలనాటికి మోదీ ఏదోకరూపంలో తీవ్రస్థాయి చర్యలకు దిగే అవకాశముందన్న అంచనాతో మాత్రం జేపీ ఏకీభవించారు.

ఇప్పుడు ఎన్నికల సంవత్సరం 2019లోకి వచ్చాక చూస్తే, జేపీ లెక్క నూరుశాతం కరెక్టనిపిస్తోంది. తరుణానికి ముందుగానే ఎండలు, వానలు, చలి ప్రవేశిస్తున్నట్లు.. యుద్ధ సంకేతమైన అరుణ గ్రహం పేరుతో ఉన్న మార్చి మాసం ఇంకా కొన్ని వారాలుండగానే భారత్‌లో యుద్ధవాతావరణం కనిపించింది. చైనా మీదకు వెళ్లే సాహసాన్ని చేయకుండా ప్రచారానికి ఉపయోగపడేరీతిలో సర్జికల్ స్ట్రయిక్ ద్వారా పాకిస్తాన్‌తో యుద్ధం కాని యుద్ధాన్ని మోదీ ప్రభుత్వం ఈ ఫిబ్రవరిలో చేసింది.

ఇది ప్రధాని కావాలని సృష్టించిన యుద్ధవాతావరణం కాకపోవచ్చు. సర్జికల్ స్ట్రయిక్స్ సమయంలో పార్టీలు, వాదాలకతీతంగా అందరూ ప్రభుత్వానికి, సైన్యానికీ అండగా నిలవాల్సిందే. ఆ పని చేస్తూనే.. మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో అంతర్గతంగానూ, దేశ సరిహద్దుల వద్దా ఉద్రిక్తతలు పెరిగాయన్నది వాస్తవాన్ని కూడా మనం పరిగణలోకి తీసుకోకతప్పదు.

(?) ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు భారత ప్రభుత్వం తెలిపింది. ఆ తర్వాత పాకిస్తాన్ ఎఫ్-16 యుద్ధవిమానాలతో దాడికి ప్రయత్నించటం, భారత్ తిప్పికొట్టటం, మన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ కూలుతున్న మిగ్ విమానం నుంచి పాక్ భూభాగంలో దిగి బందీగా చిక్కటం, ప్రపంచ దేశాల ఒత్తిడి మేరకు పాకిస్తాన్ అతన్ని సురక్షితంగా విడుదల చేయటం జరిగింది. ఇందులో భారత సైనికుల సాహసం అద్భుతమనదగ్గరీతిలో ఉండగా, ప్రభుత్వ స్పందన అంతర్జాతీయ వ్యూహాత్మక నిబంధనలకనుగుణంగానే ఉంది. అణ్వాయుధాల భయం వల్ల యుద్ధానికి సిద్ధపడలేమనే మూస ధోరణికి బదులు, అంతర్జాతీయ నిబంధనలను ఉపయోగించుకుని ఉగ్రవాదులపై దాడులు జరపటానికి వెనకడుగు వేయబోమన్న సంకేతాన్నివ్వటంలో భారత్ విజయం సాధించింది. ఇందులో ఎక్కడా పాలకుల్ని తప్పు పట్టాల్సిన పనిలేదు. కానీ సమస్యల్లా దీన్ని ఎన్నికల అంశం చేయటానికి ప్రయత్నించటం నుంచే ఉంది.

ఈ సర్జికల్ దాడుల్లో ఎక్కడా ఒక గొప్ప పాలకుడు మాత్రమే సాధించగల అంశాలు ఇమిడి లేవు. ఈ దాడుల వల్ల ఉగ్రవాదం సమసిపోదు, జమ్మూ కాశ్మీర్ సమస్య పరిష్కారం కాదు, భారత్-పాక్ మధ్య ఉన్న ఘర్షణ వాతావరణమేమీ అంతరించిపోదు. తన ఐదేళ్ల పాలనలో పీడీపీతో జమ్మూ కాశ్మీర్‌లో బీజేపీ ఏర్పాటు చేసిన ప్రభుత్వాన్ని ఉపయోగించుకుని కాశ్మీర్ ప్రజల హృదయాలను గెలుచుకోగలిగినా, ఆర్టికల్ 370 చుట్టూ వివాదాలను పెంచటానికి

బదులు, జమ్మూ కాశ్మీర్ సహా అన్ని రాష్ట్రాలకూ దేశ సమగ్రత పరిధిలో స్వతంత్ర ప్రతిపత్తినిచ్చే ఫెడరల్ వ్యవస్థను ఏర్పాటు చేయగలిగినా.. ఈ సర్జికల్ స్ట్రయిక్ ద్వారా చాటుకుంటున్న విజయం స్థాయికి మోదీ నిజంగా అర్హులై ఉండేవారు. తన చేతిలో ఉన్న అవకాశాలన్నిటినీ జారవిడిచి జమ్మూ కాశ్మీర్‌లో సంక్షోభాన్ని ఇంకా ముదరబెట్టి ఉగ్రవాదుల మీద తాత్కాలికంగా ఓ చిన్న సైనిక విజయాన్ని సాధిస్తే అది ఘనత అవుతుందా? ఈ యుద్ధంలో మోదీ సాధించిన విజయం అశాంతిని కొనసాగించేదేతప్ప శాంతిని నెలకొల్పేది కాదు. ఉగ్రవాదంపై సుదీర్ఘపోరాటానికి ఇదేమీ పటిష్ట పునాది వేసేది కాదు.

ఎన్నికల సమయంలో ప్రచారంలో పుల్వామా ప్రతీకార దాడులు మోదీ విజయాలుగా ప్రాచుర్యంలోకి వచ్చి, ఆయన కీలక వ్యవస్థాగత వైఫల్యాలు, అవినీతి, నిరుద్యోగం, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలలో సంక్షోభం, జమ్మూ కాశ్మీర్ వంటి వాటిని పరిష్కరించటంలో ఉదాసీనత, అవగాహనారాహిత్యం మరుగునపడితే, అవి చర్చనీయాంశమై పరిష్కారాలు డిమాండ్లుగా మారకపోతే.. దేశం మళ్లీ నష్టపోయే ప్రమాదముంది.


2014 ఎన్నికల సమయంలో తన మాటల్ని విధానపరమైన అంశాల చుట్టూ తిప్పుతూ ప్రజల్లో, యువతలో ఆదర్శనీయ ఆవేశాన్ని రేపిన ప్రధాని మోదీ ఈవేళ ఆ పనిచేయలేకపోతున్నారు. వ్యక్తిగత ఉద్రేకాలను రెచ్చగొట్టేందుకు ఆయన వెనుకాడటం లేదు. భారత్ చేసిన వైమానిక దాడుల వల్ల కర్ణాటకలో బీజేపీకి 22 సీట్లు వస్తాయని ఆ పార్టీ నేత యడ్యూరప్ప చేసిన వ్యాఖ్యలను కప్పిపుచ్చుకోవటానికి ప్రతిపక్షాల మీద ప్రధాని ఎదురుదాడి చేశారు. పాకిస్తాన్‌కు అనుకూలంగా విపక్ష నేతలు మాట్లాడుతున్నారంటూ ఆరోపణలు చేశారు. జాతీయ యుద్ధ స్మారక స్థలి ప్రారంభోత్సవంలో కూడా ఆయన ఇదేరీతిలో అఖిలపక్షాన్ని విస్మరించి మాట్లాడారు. ఏదో ఒక బూచినో, ఎవరినో నష్టకారకులుగానూ చూపించకుండా ప్రజలకు ప్రయోజనం చేకూర్చలేని పాత 'జీరోసమ్' రాజకీయంలోనే మోదీ ఇంకా బందీగా ఉన్నారు. ఈ విషయంలో ఆయన పెట్టుబడిదారీ మోసకారి నేత తరహాలో కంటే, కమ్యూనిస్టు భావజాల నియంతలా ఎక్కువగా కనిపిస్తుంటారు. నిజానికి చైనా నియంతృత్వాన్ని, భారత ప్రజాస్వామ్యాన్ని కలగలిపి ఒక విజయవంతమైన నాయకత్వ ఫార్ములాను ఆవిష్కరించాలన్నది మోదీ తాపత్రయం అనుకుంటే తప్పేమీ కాదు. ప్రజాస్వామ్యంలో కూడా కొద్దిమంది వ్యక్తులు, లేదా ఒకే వ్యక్తి నిర్ణయం తీసుకోవాల్సిన నియంతృత్వ సందర్భాలు కొన్ని ఉంటాయి. అయితే ఇవి చాలా తక్కువగా ఉంటాయి, అలా తక్కువగా, అరుదుగానే ఉండాలి కూడా. వీటిల్లో సైతం పారదర్శకత ఉండాలి. అయితే, ఏకపక్ష ధోరణిని అనునిత్యం, అన్నిటికీ వర్తింప చేస్తూ వ్యవస్థలను బలహీనపరుస్తూ చైనా తరహా ఏకవ్యక్తి, ఏకపార్టీ ప్రజాస్వామ్యాన్ని భారత్‌లో పాతాలని చూడటం వల్లే మోదీ పరిష్కారంలోకంటే సమస్యలో ఎక్కువగా భాగమవుతున్నారు. ఆయన చేస్తున్న పాదాభివందనాలు, పాదసేవ కార్యక్రమాలు ఆత్మన్యూనతకు అద్దం పడుతున్నాయి తప్ప.. జాతీయ స్థాయి ప్రజాసేవకుడి వినమ్రతలా లేవు.

నిజమైన దేశభక్తి, జాతీయ భావం అంటే శత్రువు చొరబడటానికి వీల్లేని రీతిలో దేశీయంగా అవినీతిరహితంగా చట్టబద్ధపాలనను అమలు చేయాలి. పుల్వామా వంటి ఘటనలను పసిగట్టటంలో మన వ్యవస్థలు విఫలం కాకుండా (ఈ ఉగ్రదాడి పెద్ద ప్రమాదం మాత్రమే, ఇందులో భద్రతా వైఫల్యం లేదు అని సాక్షాత్తూ ఒక రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఉన్న బీజేపీ నేత వ్యాఖ్యానించారంటే.. ప్రజల భద్రత, చట్టబద్ధపాలన పట్ల మన పాలకులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు) చూడాలి. ప్రజలను ఎక్కడికక్కడ పాలనలో భాగస్వాముల్ని చేయాలి. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలతో ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలి. సైన్యాన్ని ఆధునీకరించాలి. ఉగ్రవాదంపై దీర్ఘకాలిక పోరాటాన్ని చేపట్టాలి. వీటిని చేయటం కోసమే 2014లో మోదీని అసాధారణరీతిలో గెలిపించినది! వీటన్నిటినీ వదిలేసి, కేవలం మెరుగైన విదేశీ సంబంధాలు, ఉన్నతస్థాయి రాజకీయ అవినీతి కట్టడి, ఆర్థిక క్రమశిక్షణ వంటి పరిమిత విజయాలు, ఇంకొన్ని పైపై చర్యలతో, సర్జికల్ దాడులతో ప్రచార బుడగల్ని సృష్టించి మెరిపిస్తూ ఎన్నికల్లో గెలిచే ధోరణుల్ని అనుమతించకూడదు. హార్వర్డ్ ఇండియా 2019 సదస్సులో జేపీ చెప్పినట్లు.. అమెరికా బయటి ప్రపంచంతో ఎన్ని ఆయుధ వ్యాపారాలు, యుద్ధాలు చేసినా, ఆ దేశానికి అంతర్గతంగా ప్రజాస్వామిక, పాలనా వ్యవస్థలు పటిష్టంగా ఉన్నాయి. పైన చెప్పుకున్న విధానాలు వేళ్లూనుకున్నాయి. మన దేశంలో ప్రజాస్వామ్యం, పాలన, రాజకీయం చాలా అంశాల్లో 'జుమ్లా'లా కొనసాగుతున్నాయి. మనం ఇల్లు దిద్దుకోకుండా పొరుగు దేశాల మీద యుద్ధాలు చేస్తూ ఎన్నికల్లో ప్రగల్భాలు పలికితే అది దేశ ప్రయోజనాలకు ఏమీ ఉపకరించదు.

కాంగ్రెస్ పార్టీకి సరైన నాయకత్వం లేదు కాబట్టి మళ్లీ కేంద్రంలో నరేంద్ర మోదీనే గెలిపించటం, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ వల్ల 2014లో చంద్రబాబు నాయుడిని గెలిపించటం, ఇప్పుడు చంద్రబాబు పట్ల వ్యతిరేకతతో జగన్‌ని గెలిపించాలనుకోవటం.. ఈ 'టీనా' (ప్రత్యామ్నాయం లేదు) ఫ్యాక్టర్ చుట్టూనే మన రాజకీయాలు తిరుగుతుండటం దురదృష్టకరం. ప్రజల్ని ప్రభువులుగా రాజకీయ నాయకులు ఇంకా గుర్తించటానికి సిద్ధపడకపోవచ్చుగానీ.. ప్రజల ఓటు కోసం సాంప్రదాయ పార్టీలు ఎన్ని పాట్లయినా పడతాయి. నీ పోలీస్, నా పోలీస్.. నా 'సిట్', నీ 'సిట్' అంటూ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య యుద్ధంలా మారిన 'డేటా' చోరీ అంశమే ఇందుకు తాజా ఉదాహరణ! ఓటు పనయ్యాక.. ఓటుకు కోట్లు కేసులాగా దీన్ని మళ్లీ కోల్డ్ స్టోరేజీలో పారేసి రెండు రాష్ట్రాల ప్రజల చెవుల్లో పూవులు పెడితే ఆశ్చర్యపోనక్కర్లేదు. మన ఓటును తాత్కాలిక తాయిలాలు, భావోద్రేకాల చుట్టూ కాకుండా.. మనం కట్టే పన్నుల డబ్బు, మన నిజమైన ప్రయోజనాలు, మన బిడ్డల భవిష్యత్తుకు కావలసిన ఎజెండా కోసం వినియోగించుకోవటమే మనముందున్న సరైన మార్గం. సర్జికల్ స్ట్రయిక్స్ వంటివి తాజా ఎన్నికల్లో ప్రధానాంశంగా మారితే మాత్రం ప్రజలు ఓడిపోయినట్లే. ❍

# పుల్వామా పాఠాలు ఏమిటి?

- **శివ్ విశ్వనాథన్,** రచయిత, సామాజిక శాస్త్రవేత్త



*చైనా పాలకులు చాలా తెలివైనవారు. ఏదైనా ఒక అంశంపై దీర్ఘకాలిక ప్రాతిపదికన ఆలోచించడం వారి సంప్రదాయం. తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించు కుంటారు. సాధారణంగా 100 (అవును, అక్షరాలా) సంవత్సరాల ప్రాతిపదికన చైనా ఆలోచనలు, ఆచరణలు ఉంటాయి. దీనితో సరిసమానమైన సంప్రదాయం మనకు లేదు. విధానాలు డొల్లగా ఉండడం వల్లే మన ప్రజాస్వామ్యం ఆరోగ్యవంతంగా లేదు. ఒక జాతిగా మన ఆలోచనా పద్ధతులు, చింతనా ధోరణులలో దీర్ఘకాలికత అనేది పూర్తిగా లోపించింది. ఫలితంగానే మనం పటిష్ఠ వ్యూహకర్తలం కాలేకపోతున్నాం. ఈ ఆలోచనా వైకల్యం నుంచి మనం బయటపడి తీరాలి.*

ఒక సంఘటనను ఒక ఉగ్రవాద చర్యగా ఒకరు ఎలా పర్యాలోచిస్తారు? న్యూయార్క్ (సెప్టెంబర్ 11), ముంబై (నవంబర్ 26) ఉగ్రదాడులు లేదా పుల్వామా ఘాతుకం లాంటి ఘటనలకు ఒకరు ఎలా ప్రతిస్పందించాలి? నిప్పులా నిరసనను రగిలించాలి, ప్రశాంతంగా కొవ్వొత్తి కాంతులలో నివాళి యాత్ర నిర్వహించి, ఉగ్రవాద రక్కసికి వ్యతిరేకంగా మన సమైక్యతను చాటాలి... ఇలా మన భయాందోళనలను వ్యక్తం చేసిన తరువాత, జరిగిన ఘోరాన్ని, దాని పూర్వాపరాల గురించి మనం సావధానంగా ఆలోచించాలి.

ముంబైపై ఉగ్రవాదం విరుచుకుపడినప్పుడు, ఆ దుష్టశక్తికి ఆలంబనగా ఉన్న ఇరుగు పొరుగులపై దాడి చేస్తామని అప్పటి ప్రధానమంత్రి ప్రకటించారు. ఒక మహాపోరాటానికి మన సైన్యం సంసిద్ధమయింది. అయితే ఒక అడుగు కూడా ముందుకేయలేదు. లక్ష్యం, లక్ష్యసాధన సంభావ్య సాఫల్య వైఫల్యాలపై ఒక సంశయస్థితినెదుర్కోవలసి వచ్చింది. చివరకు ఏమీ జరగలేదు. ఆ ముష్కర ఉన్మాదం కలిగించిన కళంకానికి కృంగిపోయిన జాతి నెమ్మదిగా తేరుకున్నది. అయితే ఎడతెగకుండా పొంచి ఉంటోన్న ఆ ఉగ్ర ముప్పు నెదుర్కోవడ మెలా అనే విషయమై వాదప్రతివాదాలు సుదీర్ఘంగా సాగాయి. ఇంకా సాగుతున్నాయి. ఇంతలో పుల్వామా కిరాతకం సంభవించింది.

పుల్వామా ఘటన చోటుచేసుకున్న కొద్దిరోజులకే ఆ దుర్మార్గానికి దారితీసిన పరిస్థితులు, తదనంతర పర్యవసానాల గురించి మొత్తంగా వివేచించవలసిన అవసరమున్నదనే సత్యం ఆలోచనాపరులందరికీ అవగతమయింది. ఒక సంఘటన గురించి ఆలోచించడం, ఒక సంఘటన ద్వారా ఆలోచించడం మధ్య ఉన్న తేడా ఏమిటో తెలిసివచ్చింది.

అవును, పుల్వామా దుష్కార్య ప్రేరేపకులు, బాధితులను మాత్రమే కాకుండా మొత్తం పరిస్థితులను సర్వ సమగ్రంగా పరిగణలోకి తీసుకోవల్సిన సందర్భమిది. తన ఇరుగు పొరుగున ఉన్న వివిధ జాతి రాజ్యాల పట్ల భారత్ వైఖరి, అనుసరిస్తోన్న విధి విధానాల గురించి విస్తృత స్థాయిలో నిశితంగా సమాలోచన చేయవలసి ఉన్నది. భారత విదేశాంగ విధానం తీరుతెన్నులు, దాని అమలుకు అనుసరిస్తోన్న వ్యూహం, ఎత్తుగడలను నిశితంగా పరిశీలించినప్పుడు ఒక లోపం స్పష్టంగా గోచరమవుతుంది. ఏమిటా లోపం? చైనా, పాకిస్థాన్ పట్ల న్యూఢిల్లీ విధానం పూర్తిగా నిరాశానిస్పృహల్లో ఉండడమే. ఈ రెండు పొరుగు దేశాలతో వ్యవహరించడంలో భారత్ అధైర్యానికి

లోనవుతున్నట్టు కన్పిస్తోంది. ఆ దేశాల నుంచి ఎదురవుతున్న సవాళ్లకు భారత్ తరచూ అనాలోచితంగా, అనియంత్రితంగా ప్రతిస్పందిస్తున్నట్టు భావించక తప్పడం లేదు. మనం ఒక ఉన్మాదగ్రస్తతను, నాటకీయతను ప్రదర్శిస్తున్నాము. మన దౌత్యనీతిని నిశితంగా పరిశీలిస్తున్న నా మిత్రుడు ఒకరు ఇలా వ్యాఖ్యానించారు: 'చైనా పరిపూర్ణ ఆలోచనామగ్నతతో, ప్రజ్ఞాపూరితమైన చదరంగం ఆడుతుండగా, మనదేశం చైనీస్ చెకర్స్ (చదరంగంలాంటి ఆటే అయినా నియమాలు అత్యంత సులభంగా ఉండే క్రీడ)తో సంతృప్తి పడుతున్నది'. తక్షణ ప్రయోజనాలను సాధించుకోవడమే మన దౌత్యవ్యూహాల లక్ష్యంగా ఉంటోంది. చైనీస్ చెకర్స్ ఎత్తుగడలు ఎన్నికలకు సరిపోతాయిగానీ, సమర నిర్వహణ, శాంతి సాధనకు ఉపకరించేవి కావని కూడా నా స్నేహితుడు వ్యాఖ్యానించారు.

ప్రపంచాధిపత్యానికి అప్రతిహతంగా పురోగమిస్తోన్న మహాశక్తి చైనా. మన ఈ పొరుగుదేశంతో మనం ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తున్నామా? ఒక జాతి ప్రాభవ వైభవాలకు అవసరమైన ఆ అనివార్య గుణం దురదృష్టవశాత్తు మనలో కొరవడింది. పైగా చైనా పట్ల కించిత్ అసూయతో కూడా వ్యవహరిస్తున్నాము. ఎలాంటి మినహాయింపులు లేని సర్వాధికారాలు గల చైనా పాలనా వ్యవస్థ ఏ విషయంలోనైనా సరే శీఘ్రగతిన నిర్ణయాత్మకంగా వ్యవహరించగలదు. చైనాతో పోలిస్తే మన ప్రజాస్వామ్య వ్యవస్థ సహజంగానే చాలా బలహీనంగా, దుర్బలంగా కన్పిస్తుంది. మరి ఈ పరిస్థితిని అధిగమించడమెలా? చైనాతో సంబంధాల విషయంలో అనుసరించే వ్యూహాన్ని మార్చుకోవాలి. అయితే మన నాయకుల ధోరణి చూస్తుంటే ఆ ఆవశ్యకతను గుర్తించారనే భావన ఏమాత్రం కలగడం లేదు.

సరే, పుల్వామా విషాదం పట్ల మన దిగ్భ్రాంతి మందగించి, దుఃఖం ఉపశమిస్తున్న కొద్దీ మనం చేస్తున్నదేమిటి? యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నించడమే కాదూ? పుల్వామా దాడి తక్షణ హాని సైనికులకే సంభవించినా అసలైన హాని మన ప్రజాస్వామిక వివేకానికి వాటిల్లింది. ఆ ఘాతుకం చోటుచేసుకున్న వెన్వెంటనే కశ్మీరీలు మనకు అన్యులు అయిపోయారు! దేశవ్యాప్తంగా ఎల్లెడలా కశ్మీరీలను తూష్ణీ భావంతో చూస్తున్నారు. కశ్మీరీ విద్యార్థులు, కశ్మీరీ వ్యాపారులు వేధింపులకు గురవుతున్నారు. సమ న్యాయంతో వ్యవహరించవలసిన ప్రభుత్వం కశ్మీరీల హక్కులను సంరక్షించడంలో మందకొడిగా వ్యవహరిస్తోంది. సర్జికల్ స్ట్రైక్స్ (ఇది బాలీవుడ్ సినిమా కథాంశం కూడా) అనే పదబంధం ఇప్పుడు ప్రజల నుడి-నానుడిలో భాగమయింది. దౌత్య వ్యవహారాలలో నిరక్షరాస్యులు సైతం 'దేశభక్తి' ప్రపూరితంగా మన పశ్చిమ పొరుగుదేశంపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు! వాస్తవిక యుద్ధం వెండితెరపై చూసే పోరాటాలంత సులభతరమైనది కాదనే విచక్షణ ఆ యుద్ధోన్మాద మూకలలో పూర్తిగా కొరవడింది.

ఇరుగు పొరుగు దేశాల పట్ల, ముఖ్యంగా చైనా విషయంలో అసలు మనకొక స్పష్టమైన విధానమున్నదా? చైనా పాలకులు చాలా తెలివైనవారు. ఏదైనా ఒక అంశంపై దీర్ఘకాలిక ప్రాతిపదికన ఆలోచించడం వారి సంప్రదాయం. తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుంటారు. సాధారణంగా 100 (అవును, అక్షరాలా) సంవత్సరాల ప్రాతిపదికన చైనా ఆలోచనలు, ఆచరణలు ఉంటాయి. దీనితో సరిసమానమైన సంప్రదాయం మనకు లేదు. మరింత ఘోరమైన విషయమేమిటంటే మన ప్రస్తుత పాలకులకు భవిష్యత్తు గురించి ఒక పటిష్ఠ ఆలోచనే లేదు. మరి భావి సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి దోహదం చేసే విధాన నిర్ణయాలకు ఆస్కారమెలా ఉంటుంది? విధానాలు డొల్లగా ఉండడం వల్లే మన ప్రజాస్వామ్యం ఆరోగ్యవంతంగా లేదు. భిన్నాభిప్రాయాలు కలవారు, అసమ్మతి వ్యక్తం చేసేవారు అన్యులై పోతున్నారు. మూకల బెదిరింపులు, దాడులకు దిగుతున్నారు. ఒక జాతిగా మన ఆలోచనా పద్ధతులు, చింతనా ధోరణులలో దీర్ఘకాలికత అనేది పూర్తిగా లోపించింది. ఫలితంగానే మనం పటిష్ఠ వ్యూహకర్తలం కాలేకపోతున్నాం. ఈ ఆలోచనా వైకల్యం నుంచి మనం బయటపడి తీరాలి.

ఎలా బయటపడాలి? తొలుత సంకుచిత దృక్పథాలను విడనాడాలి. భారత్‌కు ప్రజాస్వామ్యమే ఒక గొప్ప ప్రయోజనకారి అనే సత్యాన్ని మళ్లీ మళ్లీ వక్కాణించాలి. ప్రజాస్వామ్యమే మా మార్గమని నిశ్చితంగా చెప్పాలి. భిన్నత్వంలో ఏకత్వంతో వర్థిల్లుతోన్న ఈ సువిశాల దేశ పురా నవ, ఉదాత్త నాగరికతా వారసత్వం పట్ల మరింత సమున్నత అవగాహనతో సున్నితంగా వ్యవహరించగలిగే ప్రజాస్వామిక సంస్కృతి మనకు ఎంతైనా అవసరం. ఉగ్రవాద, నిరంకుశాధికార సవాళ్లకు ప్రజాస్వామ్యం సముచితంగా ప్రతిస్పందించగలదని స్పష్టంగా చూపాలి. శాంతిని గురించి మన ఆలోచనా పద్ధతులు అటువంటి సంక్షోభాలతో సమున్నతమవ్వాలి. కశ్మీర్‌లో సుస్థిర శాంతికి ఒక జాతిగా, పౌర సమాజంగా మనం మరింత చురుగ్గా కృషి చేయాలి. కశ్మీరీల దురవస్థల పట్ల ఆవేదనతో మనం మన ప్రభుత్వ కశ్మీర్ విధానాన్ని ప్రశ్నించి తీరాలి. జాతీయ

భద్రతకు సంబంధించిన మన భావనలు కశ్మీర్‌లో ఎందుకు నిరర్థకమూ, నిరుపయోగమూ అవుతున్నాయో పాలకులను నిలదీయాలి. అంతర్గత లేదా ఆత్మ విమర్శే బాహ్యదాడి నుంచి పటిష్ఠ రక్షణ అనే వాస్తవాన్ని విస్మరించకూడదు. రెండోది దక్షిణాసియా పట్ల తన విధానాలను భారత్ సరికొత్తగా రూపొందించుకోవాల్సిన అవసరమున్నది.

మన సైనికాధికారులు, దౌత్యవేత్తల రచనలను చూస్తే భారత్ విధానాలు ఎంత శుష్కంగా ఉన్నాయో, అంతర్జాతీయ సంబంధాలపై భారతీయ ఆలోచనా పద్ధతులు ఎంత నాసిరకంగా ఉన్నాయో స్పష్టమవగలదు. అంతర్జాతీయ సంబంధాలను ఒక మేధోరంగంగా పునరుద్ధరించేందుకు పౌర సమాజమూ, విద్యావేత్తలూ పూనుకోవాలి. యుద్ధమూ, దాని పర్యవసానాలపై మన విద్యార్థులకు ఒక స్పష్టమైన అవగాహన కలిగించవల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతర్జాతీయ కూటములు, హిరోషిమాలో అణు విధ్వంసం, ప్రచ్ఛన్నయుద్ధం గురించి మన విద్యావంతులలో చాలామందికి సైతం తెలియదనడం సత్యదూరం కాదు. యుద్ధం, హింసాకాండ ప్రభావాలకు మాత్రమే పరిమితం కాకుండా ఒక విశాల ఆశయ ప్రాతిపదికన సమాజ భవిష్యత్తు గురించిన మన ఆలోచనలు సాగాలి.

చివరగా తెగ (ట్రైబ్), సరిహద్దు (బోర్డర్), పొలిమేర (ఫ్రాంటియర్) గురించి మనం పునరాలోచించాలి. ఈ అంశాలపై మన కొత్త ఆలోచనలను ఒక సమున్నత భిన్న స్థాయికి తీసుకువెళ్లాలి. ఒక దేశ సరిహద్దు సీమలు, పొలిమేర ప్రాంతాలను గౌణ లేదా అప్రాధాన్య ప్రదేశాలుగా పరిగణించకూడదు. అవి ఒక కొత్త ప్రజాస్వామిక ఆలోచనా పద్ధతికి కేంద్రాలు కావాలి. అలాగే మన రాజ్యాంగ భావనా స్రవంతిలో ప్రకృతికి ప్రాతినిధ్యం కల్పించేందుకు శ్రద్ధ చూపాలి. ఒక ప్రజాస్వామ్యం ఇలా అర్థవంతంగా, సున్నితంగా వ్యవహరించగలదని మనం నిరూపించాలి. అలా చేయగలిగినప్పుడు పాకిస్థానీయులు, చైనీయులు మనలను తేలిగ్గా తీసుకునే ధోరణికి తప్పక స్వస్తి చెప్పుతారు. ఇటువంటి ఉన్నతిని సాధించాలంటే ఒక జాతిరాజ్య ఉన్మాదగ్రస్తతతో గాక ఒక పరిపూర్ణ ప్రజాస్వామిక చైతన్యం, ఒక మహోన్నత నాగరికతా సంస్కారం, పురోగమిస్తోన్న ఒక నవీన సమాజ ఆత్మవిశ్వాసంతో మనం నిలబడగలగాలి. శాంతికి నిబద్ధమయి ఉన్నామని ఆచరణాత్మకంగా చూపడం ద్వారా యుద్ధానికి సంసిద్ధంగా ఉన్నామని మన విరోధులకు స్పష్టం చేయాలి. శాంతి స్థాపనకు వ్యూహాత్మక చింతకుల అవసరమున్నది. ఈ లక్ష్య పరిపూర్తికి దోహదం చేసే ప్రత్యామ్నాయ ఆలోచనలు, ప్రణాళికలే పుల్వామా బాధితులకు సరైన నివాళి కాగలవు. వారి కుటుంబాల ఆవేదనను తీర్చగలవు. భారత్ భావన అనేది చైనా, పాకిస్థాన్‌ల గురించిన ప్రతికూల భావనలను, భీతావహ ఆలోచనలను నిలువరించాలి. అటువంటి వినూత్న భావచట్రంతో జరిపే ఆలోచనలే మనం సుస్థిర శాంతితో వర్ధిల్లేందుకు, ఆత్మవిశ్వాసంతో మనుగడ సాగించేందుకు తోడ్పడగలవు. ○

*(మెయిల్ టుడే, ఆంధ్రజ్యోతి)*

## 2019 ఎన్నికలు - ఉత్తరాంధ్ర ఎజెండా



ఎన్నికలంటే పార్టీలు గెలవటం కాదని, ప్రజలు గెలవాలని, 2019 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో కీలకమైన ప్రజాసమస్యలు అన్ని పార్టీల ఎజెండాగా రావాల్సిన అవసరముందని ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అధ్యక్షతన విజయనగరంలోని హోటల్ మయూరిలో 'ఉత్తరాంధ్ర ఎజెండా – 2019 ఎన్నికలు' అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారంలో ఎవరున్నా ఉత్తరాంధ్రకు అన్యాయమే జరుగుతోందని, మనం అభివృద్ధి చెందాలంటే నీళ్లు, ఇతర వనరుల్ని ముందుచూపుతో సద్వినియోగం చేసే నాయకత్వం, విధానాలు కావాలని రామకృష్ణ అన్నారు. రాష్ట్ర విభజనకు ముందు నుంచీ ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనకబాటుతనంపై గళం విప్పి, పరిష్కారాలను చూపుతూ కృషి చేస్తున్న పార్టీ లోక్‌సత్తా అని బాబ్జీ అన్నారు. పుష్కలమైన నీటి వనరులున్నా ప్రాజెక్టులు సకాలంలో పూర్తికాక రైతులు నష్టపోతున్నారని రిటైర్డ్ ఎస్.ఈ సత్యనారాయణ, నారాయణ రాజు అన్నారు. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి, యువతకు ఉపాధిని అందించేవారినే ఎన్నికల్లో గెలిపించాలని ప్రొ॥ చంద్రమౌళి, ప్రొ॥ శివప్రసాద్ కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర నేత కామేశ్వరరావు, వైసీపీ నేతలు రాజేష్, వేణు, కాంగ్రెస్ నేత భానుమూర్తి, లోక్‌సత్తా నేత దామోదర్, సీపీఎం నాయకుడు శంకర్రావు, జనసేన నేతలు తుమ్మి లక్ష్మి, రవి, బీఎస్పీ నాయకుడు రమణ, టీడీపీ నేత తిరుపతిరావు, బీజేపీ నాయకుడు సంతోష్, ఆంధ్రచైతన్య పార్టీ నేత రామానాయుడు, ఉపాధ్యాయ నేత సింహాచలం, జర్నలిస్టుల సంఘం నాయకుడు శివశంకర్, నాయుడు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# స్వేచ్ఛను లొంగదీసే దొంగాట!

- దిలీప్ రెడ్డి

*ప్రజాస్వామ్య ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే 'ఓటరు' స్వేచ్ఛను ఆటవస్తువు చేస్తున్నారు. కోరిన తీరున పంచుతున్నారు. ఓటు విలువను పలుచన చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో తనకిష్టమైన పాలకులను నిర్ణయించుకునేందుకు, తన మనోగతాన్ని వెల్లడి చేసేందుకు బలమైన ఆయుధం 'ఓటు'. లాటిన్ అమెరికా సాహితీ ప్రపంచంలో వేగుచుక్క అనదగ్గ కవి, రచయిత, జర్నలిస్టు, సామాజికవేత్త అయిన జోస్ మార్టి (క్యూబా) మాటల్లో చెప్పాలంటే.. "అన్నింటికన్నా ఓటు అత్యంత సున్నితమైన విశ్వాసం. ఓటరు ప్రయోజనం మాత్రమే కాదు అతని జీవితం, పరువు, భవిష్యత్తు కూడా ఓటుతో ముడిపడి ఉన్నాయి."*



**"పైసల్ తీస్కొని ఓటేసుడా..? థూ... ఓటుకు పైసల్ తీస్కునుడంటే, పానం (జీవితం) అమ్ముకున్నట్టు లెక్క పటేలా! ఇజ్జత్ (పరువు) అమ్ముకున్నట్టు"**

సరిగ్గా ముప్పై ఏళ్ల కింద... 1989లో జరిగిన ఎన్నికలప్పుడు మెదక్ జిల్లా మారుమూల గ్రామం యెనగండ్ల (మా ఊరు)లో 42 ఏళ్ల వయసున్న ఓ వ్యవసాయ దినకూలీ అన్నమాటలివి. దాన్ని అవగాహన అనాలో, చైతన్యం అనాలో, నైతికత అనాలో, మరేమనాలో తెలియదు. నాటి పరిస్థితిని నేటితో పోలిస్తే... ఎన్నో రెట్లు అవగాహన పెరిగింది. చైతన్యం రగిలింది. నైతికతే దిగజారింది. ఓటుకింత అనే లెక్కలో తమకు తక్కువ డబ్బులిచ్చారని ఒక వార్డు వాసులు ఓ రాజకీయ పార్టీ కార్యాలయం ముందు ధర్నాకు దిగే పరిస్థితులు నేడు నెలకొన్నాయి. 'ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో నాకు 11 కోట్ల రూపాయలు ఖర్చయింది' అని రాజ్యాంగ హోదా అనుభవిస్తున్న ఓ బడా నేత నిర్భయంగా ప్రకటించుకునే పరిస్థితి! ఓటర్ల జాబితా సవరించాకా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి పేరిటే హైదరాబాద్‌లో రెండు ఓట్లున్న దుస్థితి! ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి ఎంతగా ప్రచారం చేస్తున్నామో, దాని విలువను దిగజార్చే పరిస్థితులు, పరిణామాలే అంతకు పలురెట్లు అధికమవుతున్నాయి. తిలా పాపం తలా పిడికెడన్నట్టు ఆ పాతకానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యక్తులేకాక వ్యవస్థలూ కారణమవుతున్నాయి. ఏదో రీతిన ఓట్లు దండుకొని గద్దె నెక్కాలనే నాయకులు, ఓటరు జాబితాలు తారుమారు చేసే పార్టీ గణాలు, ఎన్నికల ప్రక్రియను ప్రహసనం చేసే అధికార యంత్రాంగం, ఓటు హక్కునే విస్మరిస్తున్న 'నాగరికులు', విడిగా-ఉమ్మడిగా వెలకట్టి అమ్ముకుంటున్న ఓటర్లు... ఇలా అన్ని వైపుల నుంచీ ఓటు విలువను దిగజారుస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థనే నవ్వులపాల్జేస్తున్నారు. ప్రజాస్వామ్యం మీద, ఓటు విలువపైన విశ్వాసమున్న వారి నమ్మకం రోజురోజుకు సడలిపోయేలా పరిస్థితులు విషమిస్తున్నాయి. దీనికి తోడు ఇప్పుడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై తలెత్తిన వివాదం గోటిచుట్టపై రోకటిపోటులా తయారయింది. మళ్లీ బ్యాలెట్‌కు వెళదామా? అనే చర్చ-మీమాంస పుట్టుకొస్తోంది. ఎన్నిసార్లు సవరణ ప్రక్రియ చేపట్టినా... తప్పుల తడిక ఓటరు జాబితాలు సగటు ఓటరును వెక్కిరిస్తున్నాయి. వ్యవస్థల్ని చెరబట్టిన రాజకీయ దళారీలు ఈ జాబితాల్ని కలుషితం చేస్తున్నారు. లక్షల దొంగ ఓట్లను చేర్చడం ద్వారానో, తమకు ఓటేయరనే భయంతో లక్షలాది అసలు పేర్లను తొలగిస్తూనో అరాచకం సృష్టిస్తున్నారు. ఈ నేర ప్రక్రియ క్రమంగా ప్రమాదకర స్థాయిలో వ్యవస్థీకృతమవుతోంది.

## ఎన్నికల సంఘం వైపు వేలు

ప్రక్షాళన పేరిట రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఓటర్ల జాబితాలను అత్యంత కలుషితం చేశారు. నిన్నటికి నిన్న అసెంబ్లీ ఎన్నికల ముంగిట తెలంగాణలో లక్షలాది ఓట్లు గల్లంతయ్యాయి. రేపు ఎన్నికలు జరగాల్సిన ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది దొంగ, నకిలీ ఓట్లచ్చి జాబితాలో తిష్ఠ వేశాయి. ప్రక్షాళన కోసం వాడుతున్న సాఫ్ట్‌వేర్ లోపభూయిష్టమే కాకుండా నిర్వహణ ప్రక్రియలోనూ అనేక లోపాలున్నాయి. వివిధ స్థాయిల్లో అధికార యంత్రాంగం అత్యంత నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా వ్యవహరించింది. జవాబుదారీతనం లేకుండా యధేచ్ఛగా వ్యవహరించి ఓటరును నిమిత్తమాత్రుడిని చేసింది. ఓటు నమోదు, తొలగింపు ద్వారా సవరణ, ప్రక్షాళన ప్రక్రియల్లో ప్రజాప్రాతినిధ్య చట్టం కింద పౌరుల (ఓటర్ల)కున్న హక్కుల్ని నిర్దాక్షిణ్యంగా కాలరాసింది. తెలిసి కొంత, తెలియక ఇంకొంత నేడున్న దురుద్దేశపు రాజకీయ వ్యవస్థకు ఊడిగం చేస్తోంది. తెలంగాణలో చాలా చోట్ల జాబితాను ఓటర్లు తనిఖీ చేసినపుడు తమ పేరుంది, నంబరుంది... దాన్ని ఆధారం చేసుకొని తగిన గుర్తింపు కార్డుతో పోలింగ్ స్టేషన్‌కు వెళితే పేరు లేదు, ఓటే లేదు. ఓటేయకుండానే ఉస్సురంటూ వెనక్కి రావలసి వచ్చింది. 'అవును 22 లక్షల ఓట్లను తొలగించామని' ఎన్నికల ప్రధానాధికారే అంగీకరించిన వాస్తవం. వివాదమిప్పుడు న్యాయస్థానం పరిధిలోకి చేరింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 52 లక్షల దొంగ/నకిలీ ఓట్లు రాష్ట్ర ఓటర్ల జాబితాలో చేరినట్టు ఓ నిపుణుల బృందం శాస్త్రీయంగా నిరూపించింది. ఎన్నికల సంఘం దీన్ని పాక్షికంగా అంగీకరించి, తిరిగి సవరణ చేపడితే... పెనంలోంచి పొయిలో పడ్డట్టు, ఇప్పుడు మరో 6 లక్షలు నకిలీ ఓట్లు అదనంగా వచ్చి చేరాయి. దాదాపు 25 లక్షల నకిలీ ఓట్లున్న మాట నిజమే అని రాష్ట్ర ఎన్నికల (కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల తప్పించిన) ముఖ్యాధికారే స్వయంగా అంగీకరించి ఆ మేరకు ప్రకటన వెలువరించారు. ప్రపంచమే అచ్చెరువొందేలా ఓ పెద్ద ఎన్నికల ప్రక్రియని దశాబ్దాల తరబడి నిర్విఘ్నంగా, ప్రశాంతంగా కొనసాగిస్తూ కీర్తికిరీటం దక్కించుకున్న భారత ఎన్నికల సంఘం ఈ వైఫల్యాలకు జవాబు చెప్పుకోవాల్సి వస్తోంది. సగటు ఓటరు ముందు దోషిగా నిలబడింది. ఓటరు జాబితాలోంచి పేర్లు తొలగిస్తున్నప్పుడు పాటించాల్సిన చట్టబద్ధ ప్రక్రియను తూతూ మంత్రంగా నిర్వహించారు. అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించకపోగా, ఎవరికి వారు ఆన్‌లైన్లో తనిఖీ చేసుకొని పేరు లేకుంటే, సంప్రదించి చేర్పించుకోవచ్చని బాధ్యతని ఓటరుపైకి నెట్టారు. వివిధ దశల్లో పాటించాల్సిన పారదర్శకతను మంటగలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కును హరించి అదనపు బాధ్యతను పౌరుల నెత్తిన రుద్దారు.

## సవరించిన జాబితాల్లోనూ తప్పులా!

తప్పుడు, అక్రమ, రిపీట్, చెల్లని, దొంగ, బహుళ... ఇలా వివిధ రూపాల్లో ఉన్న నకిలీ ఓట్లను తొలగించడానికి ఎన్నికల సంఘం అధికారులు వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ సమగ్రంగా లేదు. ఫలితంగా ఒకే వ్యక్తికి వివిధ పోలింగ్ స్టేషన్ల పరిధిలో పది ఓట్లుంటున్నాయి. తండ్రి/భర్త పేరు మార్పుతో, ఇంటి నంబరు మార్పుతో, మగ-ఆడ అన్న లింగవైవిధ్యంతో ఒకరికే వేర్వేరు చోట్ల ఓట్లుంటున్నాయి. ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉండగలిగిన చిన్న ఇళ్లల్లో కూడా వందలాది ఓట్లుంటున్నాయి. ధ్రువీకరించడం తేలిగ్గా సాధ్యపడే కొన్ని తప్పిదాల్ని కూడా అధికార యంత్రాంగం ఇప్పుడు ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ పట్టుకోలేకపోతోంది. అది దుస్సాధ్యమైందేమి కాదు, ప్రయివేటు వ్యక్తులు, సంస్థల వద్ద కూడా లభ్యమయ్యే సాధారణ సాఫ్ట్‌వేర్ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రెండు రాష్ట్రాల్లో ఓటర్లుగా ఉన్న ఒకే వ్యక్తిని కూడా ఇప్పుడు అధికారులు వాడుతున్న సాఫ్ట్‌వేర్ పట్టుకోలేకపోతోంది. ఫలితంగా రెండు, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల్లో ఓటున్న వారి సంఖ్య 18.5 లక్షలున్నట్టు ప్రయివేటు నిపుణుల సంస్థ తేల్చింది. ఓటరు ఐడి, ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, ఇంటి నెంబరు, వయసు, జెండర్, పేరు వెనుక-ముందు... ఇలా పలు అంశాల్ని పరిగణలోకి తీసుకొని లెక్కించినపుడు ఏపీలో పెద్దసంఖ్య నకిలీ ఓట్లు దొరికాయి. 13 జిల్లాలు, 175 నియోజకవర్గాలు, 45,920 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఉన్న 3.6 కోట్ల ఓటర్ల సమాచారాన్ని తీసుకొని శాస్త్రీయంగా తనిఖీ-విశ్లేషణ చేసి మరో 34.17 లక్షల (వెరసి 52.67 లక్షల) నకిలీ ఓట్లున్నట్టు తేల్చారు. ఇదంతా బట్టబయలై జరిపిన తాజా సవరణ తర్వాత కూడా జాబితా తప్పుల తడకే! మళ్లీ ఒకే వ్యక్తి పేరిట నాలుగేసి ఓటరు కార్డులు కూడా జారీ చేశారు. సవరణ తర్వాత... అసలు ఇంటి నెంబరు, నిజమైన వయసు, వాస్తవిక జెండర్‌తో సవరించిన పేర్లు జాబితాలోకి వచ్చాయి. అదే సమయంలో, పాత (నకిలీ) పేర్లూ తుది జాబితాలో కొనసాగుతున్నాయి. మీ ఇంట్లో, మీకు తెలియకుండా ఐదారుగురు పైశాచి (గోస్ట్) ఓటర్లుంటారు. ఇలాంటి 'బోగస్' ఓట్లు ఇంకెన్నో! మొత్తమ్మీద ఇదీ తెలుగునాట నెలకొన్న దుస్థితి!

### పెత్తనం కోసం సంపద వికృత రూపం

అన్ని వ్యవస్థల మీద రాజకీయ పెత్తందారీతనం పెరిగి అటువైపు ఆకర్షణ అధికమైంది. ఏదో రూపంలో రాజకీయాధికారం దక్కించుకోవాలి. సంపద కలిగినవారికి ఇదింకా మోజయింది. అడ్డదారి సంపాదన ఉన్నవారు వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేసైనా అధికారం చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. ఓటరు జాబితాల్లో కూడికలు, తీసివేతలు చేస్తూ తమ ఓట్ల పంట పండించుకుంటున్నారు. లేదంటే, ప్రత్యర్థులకు ఓట్ల కరువు తీసుకువస్తున్నారు. మధ్యలో 'ఓటర్'ను బలిపశువు చేస్తున్నారు. పెరుగుతున్న ఆర్థిక అంతరాలు ఈ పరిస్థితులకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. నిన్న ముగిసిన శాసనసభ ఎన్నికల్లో డబ్బు ఎంతగా ఖర్చయిందో అందరికీ తెలుసు. తాజా గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీలో ఎవరున్నా, తెరవెనుక ఆట నడుపుతున్న ఈ 'నికృష్ట సంపదే' వారిని ఆడించింది. పట్టణాలు, నగరాలు, పారిశ్రామికవాడల నుంచి వనరులు గ్రామానికి వరదై పారాయి. ఎక్కడికక్కడ డబ్బు, మద్యం ఏరులై ప్రవహించింది. ఓటుకింతని డబ్బు పెట్టి కొన్నారు. ఓటర్లనే కాదు, గంపగుత్తగా కుటుంబాలను, వాడలను వశపరచుకున్నారు. ఏదో రూపంలో ప్రలోభపెట్టారు. లొంగని చోట భయపెట్టారు. పై స్థాయి నుంచే, ఓటర్లయిన పౌరుల చేతికి నికరంగా డబ్బులు వచ్చేలా 'పథకాలు' పన్ని వేర్వేరు స్కీముల్లో వారిని ఇరికించారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో కీలకపాత్ర పోషించే 'ఓటరు' స్వేచ్ఛను ఆటవస్తువు చేశారు. కోరిన రీతిన పంచారు. ఓటు విలువను పలుచన చేశారు. ఓటరు చైతన్యమే దీనికి విరుగుడు. ఓటరు గట్టిగా నిలబడాలి. డబ్బు పంచినా, ప్రలోభపెట్టినా తన 'ఓటు' హక్కు భంగపోకుండా స్వతంత్రంగా వ్యవహరించాలి. స్వేచ్ఛగా ఓటేయాలి. బాహ్య ప్రేరకాలెలా ఉన్నా... స్వేచ్ఛగా ఓటేసే తన హక్కుని అవి ప్రభావితం చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో తనకిష్టమైన పాలకులను నిర్ణయించుకునేందుకు, తన మనోగతాన్ని వెల్లడి చేసేందుకు బలమైన ఆయుధం 'ఓటు'. లాటిన్ అమెరికా సాహితీ ప్రపంచంలో వేగుచుక్క అనదగ్గ కవి, రచయిత, జర్నలిస్టు, సామాజికవేత్త అయిన జోస్ మార్టి (క్యూబా) మాటలతో ముగిస్తా. "అన్నింటికన్నా ఓటు అత్యంత సున్నితమైన విశ్వాసం. ఓటరు ప్రయోజనం మాత్రమే కాదు అతని జీవితం, పరువు, భవిష్యత్తు కూడా ఓటుతో ముడిపడి ఉన్నాయి." ○

*(సాక్షి సౌజన్యంతో)*

# ఎమ్మెల్యే రాజ్యంతో విశృంఖల అవినీతి



ఆంధ్రప్రదేశ్‌లో వికృతమైన కేంద్రీకృత పాలన, ఎమ్మెల్యే రాజ్యం నెలకొన్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ అన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఉండాలన్నా వెళ్లాలన్నా ఎమ్మెల్యేల చేతుల్లో ఉందని, దీంతో అవినీతికి అడ్డులేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, పంచాయతీలు, మునిసిపాలిటీల పాలనల్లో జోక్యం చేసుకోని శాసనసభ్యులు కనిపించరన్నారు. ఈ పాలనా తీరు మారకుండా, ఎన్ని స్కీముల్ని ప్రవేశపెట్టినా, ఎంత టెక్నాలజీని ఉపయోగించినా ప్రయోజనం ఉండదన్నారు. ప్రభుత్వ, ప్రజా వ్యవస్థలను బలహీనపరుస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై స్పందన (అవినీతి వ్యతిరేక సంస్థ) ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని టౌన్‌హాల్‌లో జరిగిన నిరసన సభలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల్లో గెలవటానికి రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ఎంతకైనా తెగిస్తున్న, వ్యవస్థల్ని సైతం కూల్చివేస్తున్న రాజకీయం పట్ల ప్రజలు పార్టీలకతీతంగా అప్రమత్తమవ్వాలని వర్మ కోరారు. పార్టీలకన్నా, నాయకులకన్నా.. ఎజెండా ముఖ్యం కావాలన్నారు. రాష్ట్రంలో ఉచితమని ప్రకటించిన ఇసుక ద్వారా గడచిన నాలుగేళ్లలో రూ.10,000 కోట్లను అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ముడుపుల రూపంలో దోచుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి అజేయ్ కల్లాం ఆరోపించారు. పెరిగిపోతున్న అవినీతికి అడ్డుకట్ట వేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. దేశంలో దొంగలు, అవినీతిపరులకన్నా చదువుకున్నవారు అవినీతిపరులుగా మారితేనే ఎక్కువ ప్రమాదమని కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. స్పందన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా విషయంలో ప్రధాని, ముఖ్యమంత్రి ప్రజలను మోసం చేశారన్నారు. జిల్లా పద్యనాటక కళాకారుల సంఘ అధ్యక్షుడు పిన్ను గంగాధర్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. స్పందన కార్యదర్శి డీవీ రావు, మేధావులు, ప్రముఖులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

★ *యుద్ధం వద్దని, శాంతి ముద్దని అందరి కంటె ముందు తెలిసినది వీర సైనికుడికే. ఎందుకంటే అతనికి మాత్రమే యుద్ధం పర్యవసానాలు తెలుసు.*

**- డాక్టర్ కె.శ్రీనివాస్, సీనియర్ సంపాదకులు**

★ *జమ్మూ కాశ్మీర్‌లో ఎల్లెడలా బలరాజ్ పురికి అత్యున్నత స్థాయి గౌరవాదరాలు ఉన్నాయి. అయితే సొంత రాష్ట్రం వెలుపల ఆయనకు ఉండవలసిన పేరు ప్రఖ్యాతులు లేవు. ఇది ఎంతైనా శోచనీయం. మరెప్పటి కంటే ఇప్పుడే భారతదేశానికి బలరాజ్ పురి లాంటి దేశభక్తుడు అత్యంత అవసరం. నిరంతరం ఏదో ఒక దేశాన్ని దూషించడంలో గాకుండా, మనదేశాన్ని మరింత సహనశీల, మరింత సంపద్వంత సమాజంగా రూపొందించడానికి తోడ్పడే మాటలు, చేతల్లో దేశభక్తిని వ్యక్తం చేసే స్త్రీ పురుషుల అవసరం ఇప్పుడు భారతావనికి ఎంతగానో ఉన్నది. దళితులు, స్త్రీలు మొదలైన అణగారిన వర్గాల వారి జీవితాలకు హుందాను కల్పించడానికి కృషి చేస్తూ.. అదే సమయంలో భాష, కుల మతాలతో విడిపోయివున్న దేశ పౌరుల మధ్య పరస్పర గౌరవం, సహనశీలతను పెంపొందించడానికి పాటుపడటమే నిజమైన దేశభక్తి. ప్రతీకల పూజకు దేశభక్తిని కుదించివేయడానికి కొంతమంది ఇష్టపడతారు. అయితే తిరంగ జెండాను రోజుకు పదిసార్లు పూజించినంత మాత్రాన ఉత్తమ దేశభక్తులవుతారా? మీ ప్రాంతాన్ని, మీ పట్టణాన్ని, మీ జిల్లాను, మీ రాష్ట్రాన్ని, దేశాన్ని మరింత సహనశీల, సమ్మిళిత, ప్రజాస్వామిక నెలవుగా తీర్చిదిద్దడానికి కృషి చేయడమే మరింత నిర్మాణాత్మక, మరింత మన్నికైన దేశభక్తి అవుతుంది. బలరాజ్ తన రచనా వ్యాసంగం ద్వారా నిజమైన దేశభక్తిని పెంపొందించారు. నిత్యజీవితంలో విభిన్న వర్గాల మధ్య పరస్పర గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేశారు. భారత రాజ్యాంగ ఆదర్శాలకు అనుగుణంగా దేశాన్ని తీర్చిదిద్దడానికి తన జీవితాంతం పాటుపడ్డారు. ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యం అనంతరం కూడా భారతదేశం ఒక తీవ్ర విభజిత సమాజంగా ఉండిపోయింది. అధికార లాలసతో రాజకీయవేత్తలు, టీఆర్‌పీలను పెంచుకునే ఆరాటంతో మీడియా ఈ విభజనలను మరింతగా పెంచుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో.. వివిధ వర్గాల మధ్య సమన్వయం సాధించడం మనదేశంలో అత్యంత కష్టమైన పనుల్లో ఒకటి. అంతేకాదు అత్యంత ఆవశ్యక కర్తవ్యం కూడా. కులాల, ప్రాంతాల, భాషల, మతాల మధ్య సంబంధాలలో అనుమానాలు, వైషమ్యాల స్థానంలో పరస్పర గౌరవం, గుర్తింపు చోటుచేసుకున్నప్పుడు మాత్రమే మనదేశం సమైక్యంగా, ప్రజాస్వామిక వ్యవస్థగా మనగలుగుతుంది.*

*–రామచంద్ర గుహ, చరిత్రకారుడు*

★ మన దేశంతో పోలిస్తే విదేశాల్లోనే మహిళలకు ఎక్కువ గౌరవం లభిస్తోంది. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గనే క్రమంలో వేర్వేరు దేశాలకు వెళ్లినప్పుడు ఈ విషయాన్ని గమనించాను. భారత్‌లో ప్రజలు మహిళల పట్ల గౌరవ మర్యాదలు ప్రదర్శిస్తున్నా, అవి అనుకున్నంత స్థాయిలో లేవు. పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధం మాటలకే పరిమితమైంది. ఏ సమాజానికైనా మహిళా వివక్ష ఆహ్వానించదగ్గ పరిణామం కాదు. లైంగిక వేధింపులంటే శారీరక కోర్కెలు తీర్చమని బలవంతం చేయడం ఒక్కటే కాదు, మానసిక, ఇతర వేధింపులనూ అలాగే పరిగణించాలి.

– పీవీ సింధు, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

★ విశాఖ జోన్ ఇవ్వడానికి దక్షిణమధ్య రైల్వే జోన్‌ను నిలువునా చీల్చి, దాని ఉనికిని నామమాత్రం చేయడం తెలంగాణనూ ఉలిక్కిపడేలా చేసింది. ఎవరినీ నామమాత్రంగానైనా సంప్రతించకుండా, అధ్యయన సంఘాన్ని నియమించకుండా వాల్తేరు డివిజన్‌ను 70 శాతం ఒడిశాలో, 30 శాతాన్ని ఏపీలో ఉంచాలని రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. నాందేడ్ డివిజన్‌ను తమకు ఇవ్వాలంటున్న సెంట్రల్ రైల్వే డిమాండ్‌కు రేపు తలొగ్గితే దక్షిణ మధ్య రైల్వేలో మిగిలేవి హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లే అవుతాయి. విశాఖ రైల్వే జోన్‌ను అశాస్త్రీయంగా విభజించడం వల్ల ప్రయాణికులు, ఉద్యోగులకే కాక పింఛనుదారులకూ తిప్పలు తప్పవు. ఈ పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని భాగస్వాములతో సమగ్రంగా చర్చించిన తరువాతే కొత్త జోన్ పరిధిని నిర్ణయిస్తే అటు రైల్వేకు, ఇటు తెలుగు రాష్ట్రాలకు మేలు జరుగుతుంది.

– మునగవలస శ్రీనివాస పట్నాయక్

★ రెండవ పరిపాలనా సంస్కరణల సంఘం సూచించినట్లు.. ప్రభుత్వం చేయాల్సిన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి బాధ్యతల్ని సక్రమంగా చేసేలా వ్యవస్థల్ని బలోపేతం చేయటం అంశాన్ని 'అందరికీ కనీస ఆదాయ' పథకం (యూబీఐ) అమలులో మొదట పరిగణలోకి తీసుకోవాల్సిన అంశం. ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయటానికి బలమైన నిర్వహణ, పాలనా, రాజకీయ సామర్థ్యాలు కావాలి తప్ప, ఆర్థికవేత్తలు కాదు.

– అరుణ్ మైరా, ప్రణాళికా సంఘం సభ్యులు

(కర్టెసీ: ఈనాడు, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, ది హిందూ, సోషల్ మీడియా) ❍


# FORM IV

1. Place of Publication : Hyderabad
2. Periodicity of its publication : Fortnightly
3. Printer's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)
4. Publisher's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)
5. Editor's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)
6. Name and address of individual who own the news paper : Dr. Jaya Prakash Narayan
   Indian
   Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)

and partners or shareholders holding More than one per cent of the total capital NA

I, Dr. Jaya Prakash Narayan hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief

Date : 16 March 2019

(Sd) (Jaya Prakash Narayan)
Signature of the Publisher

# విద్య పట్ల నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోయిన తెలుగువారు, దేశం!

విద్య, ఆరోగ్యం బాగుంటే రాష్ట్రం, దేశం పచ్చగా కళకళలాడతాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు. విద్యార్థులు బట్టీ పట్టద్దని, ఏ విషయాన్నయినా తెలివిగా చూస్తూ పరిష్కారంలో భాగం కావాలని సూచించారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎం.కె బేగ్ మునిసిపల్ పాఠశాల, పాయకాపురం జూనియర్ కళాశాలల విద్యార్థులతో జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు.

అందరిలోనూ ప్రతిభ ఉంటుందని, కానీ అది వికసించాలంటే విద్య తప్ప మార్గంలేదని జేపీ అన్నారు. విద్య పట్ల గౌరవం, మోజు ఉన్నప్పటికీ నాణ్యమైన విద్యను దశాబ్దాలుగా మన పాలకులు నిర్లక్ష్యం చేయటంతో దేశం, తెలుగువారు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ వైఫల్యాన్ని సరిచేయటం కోసమే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలల్ని చూస్తూ వస్తున్నానని, వైద్యశాలల్ని ఇంకా ఎక్కువగా పరీక్షించానని అన్నారు. నూటికి ఒకట్రెండు స్కూళ్లలో తప్ప మిగిలిన చోట్ల చదువు అధ్వాన్నంగా ఉందన్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థి మీదా రూ.60,000 ఖర్చు చేస్తున్నా మంచి చదువు రావటం లేదని, ప్రాణం పోసే ఆస్పత్రుల్లో వైద్యసిబ్బంది కష్టపడుతున్నా వారికేమో తగినన్ని నిధులు లేవని అన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు జేపీ పలు సూచనలు చేశారు. విద్యకు మార్కులు కొలమానం కాదని గుర్తించాలన్నారు. విశ్లేషణా శక్తిని, తర్కాన్ని, హేతుబద్ధ ధోరణుల్ని పెంచుకోవాలని, కొత్తగా ఆలోచించి పరిష్కారాలు అందించటం అలవరచుకోవాలని అన్నారు.

చుట్టూ ఉన్న సమాజాన్ని పట్టించుకోవాలని, అందరికీ సమాన విద్య, వైద్యం అవకాశాలు ఎందుకు లేవో ఆలోచించాలని విద్యార్థులను జేపీ కోరారు. పప్పుదినుసుల కొరతకు దిగుమతుల మీద ఆధారపడకుండా రైతులకు ఎలా మేలుచేయొచ్చో, లంచాల్లేకుండా ప్రభుత్వ కార్యాలయాలను ఎలా సంస్కరించొచ్చో రైతు బిడ్డలు, మధ్యతరగతి యువత తెలుసుకోవాలన్నారు. సురాజ్య యాత్ర లక్ష్యాలైన విద్య, వైద్యం, చట్టబద్ధపాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు, మౌలిక వసతులు వంటివి ప్రభుత్వం చేయాల్సిన పనులని, పెద్ద ఖర్చులేనివని, ఎవరికీ అభ్యంతరం కూడా ఉండనివని, అయినా ఇప్పటివరకూ చేయలేదని అన్నారు. ప్రజల్లో, విద్యార్థులు-యువతలో చైతన్యం రగిలితేనే ప్రభుత్వాలు




**ఉద్యోగం ఎందుకు మానేశారు సార్?**

ఐఏఎస్ ఉద్యోగం ఎందుకు మానేశారని ఓ విద్యార్థిని అడగ్గా జేపీ స్పందిస్తూ.. 16 ఏళ్లు వివిధ హోదాల్లో పనిచేశానని, చాలామంది ప్రమాణాల్లో చూస్తే ఇది 60-70 ఏళ్లకు సరిపడా పనిచేసినట్టని అన్నారు. ఆ తర్వాత దేశంలో ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు కల్పించే వ్యవస్థల నిర్మాణం కోసం రాజకీయ, పాలన, ప్రజాస్వామ్య సంస్కరణోద్యమంలోకి వచ్చానన్నారు.

స్పందిస్తాయన్నారు. రాజ్యాంగం, పాలన, స్వేచ్ఛ, చట్టాల అమలు, చుట్టూ ఉన్న సమస్యల గురించి కొంతైనా మనకు పరిజ్ఞానం ఉండాలన్నారు. అలా స్కూలు స్థాయి నుంచే సమాజం, పాలన గురించిన పరిశీలన ఉంటే.. కెరీర్‌లోనూ ఎదగగలుగుతారన్నారు. ఎవరి చదువుల్ని, ఉద్యోగవ్యాపారాల్ని చూసుకుంటూ కొంత సమయాన్ని సమాజం కోసం కేటాయించటం మినహా భారతదేశ ఉజ్వల భవిష్యత్తుకు గ్యారంటీ ఏమీ లేదన్నారు. అవగాహనతో, తోటివారితో కలిసి సంఘటితంగా పనిచేసేందుకే సురాజ్య పరిష్కార వేదికలుగా 'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్' అనే వెబ్ ప్లాట్‌ఫారాలను అందుబాటులోకి తెచ్చామని, పెత్తందారీ ధోరణులకు ఆస్కారంలేని ఈ ఓపెన్ ప్లాట్‌ఫారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లోక్‌సత్తా 2.0 ఉద్యమసంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ నాయకులు భీశెట్టి బాబ్జీ, కల్లూరి బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ పట్టాభిరామయ్య, వజీర్, బి.అశోక్, రవితేజ, ప్రేమ్‌శంకర్, పూర్ణచంద్రరావు, మున్నా, సురేష్, పలువురు వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ❍

# ప్రత్యేక హోదాపై మళ్లీ మోసపోకండి!




**మిత్రులారా! ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తాం, తీసుకొస్తాం అనగానే 2019లోనూ ఓటేసేయబోకండి....**

- ప్రత్యేక హోదా అంటే ఏమిటి?
- హోదా ద్వారా కేంద్ర ప్రభుత్వం నుండి ఎంత డబ్బుని, ఎంతకాలంలోగా తెస్తారు?
- పారిశ్రామిక పన్ను రాయితీల్ని ఇతర రాష్ట్రాలతో సమస్యలు లేకుండా ఏ రకంగా సాధిస్తారు?

...తదితర అంశాలన్నిటినీ వివరంగా తెలుసుకున్నాకే, మీకు నిజాయతీగా నమ్మకం కలిగాకే సరైన అభ్యర్థికి, పార్టీకి ఓటు వేయండి.

ఏపీకి ప్రత్యేక హోదాకు సంబంధించి మీకు ఈ వివరాలన్నిటినీ ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ - ఎఫ్.డి.ఆర్)/లోక్‌సత్తా చొరవతో జేపీ కన్వీనర్‌గా స్వతంత్ర నిపుణుల బృందం (ఐజిఇ) రూపొందించిన నివేదికలో అందుబాటులో ఉన్నాయి. ఇతర విభజన హామీలకు సంబంధించి కూడా కచ్చితంగా రావాల్సిన నిధుల వివరాలు, విధి విధానాలు ఇందులో ఉన్నాయి.

ఈ స్వతంత్ర నిపుణుల బృందం నివేదికను, రాజకీయ పార్టీల హామీల్ని పోల్చి చూసుకున్నాకే ఓటు వేయండి.

ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలపై మళ్లీ మోసపోకండి !

**details @ www.fdrindia.org**

Posting Date 22-03-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on March 16th 2019



భారతదేశ సుస్థిరాభివృద్ధికి అమలుచేయాల్సిన ఆచరణీయ రాజకీయ,
పాలనా మార్పులపై కొలంబియా యూనివర్సిటీ (న్యూయార్క్, అమెరికా) లో
విద్యార్థులకు వివరిస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ

**Book-Post**

PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad